కింద పడ్డానని
ఆగిపోకు,
తిరిగి ప్రయత్నం చేస్తే
విజయం నీదే

- అబ్దుల్ కలాం

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 207 విశాఖపట్నం, 31 మే 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250



## విశ్వ సుందరి కిరిటం ఎవరికో?

### హైటెక్స్ వేదికగా నేడే మిస్ వరల్డ్ ఫైనల్స్

మిస్ వరల్డ్ పోటీలు తుది ఘట్టానికి చేరుకోవడంతో కిరీటం ఏ దేశ భామను వరిస్తుందోననే ఉత్కంఠ నెలకొంది. హైటెక్స్ వేదికగా శనివారం సాయంత్రం ఫైనల్స్ జరగ నున్నాయి. దీనికోసం నిర్వాహకులు రిహార్సల్స్ కూడా పూర్తి చేశారు. మిస్ వరల్డ్ ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత ప్రభావవంతమైన ఫెస్టివల్‌గా యేటా నిలుస్తోంది. కేవలం అందచందాలకే ప్రాముఖ్యత కాకుండా, ఈ కార్యక్రమం తెలివితేటలు, సామాజిక న్యాయం, సాంస్కృతిక మార్పిడి, ఉద్దేశ్యం, నాయకత్వ లక్షణాల ద్వారా మహిళలను సాధికారతను చేస్తుంది.

- వివరాలు 8లో



# పారిశ్రామికవేత్తల ద్వారానే సంపద సృష్టి

### సీఐఐ వార్షిక సమ్మేళనంలో ఏపీ సీఎం చంద్రబాబు



**ఢిల్లీ:** సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేమని.. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఏపీలో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను వివరించారు. సంపద సృష్టిలో ఏపీకి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చేశాయన్నారు. 1990లో ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని, దాన్ని ముందుగా అందుకున్న వాళ్లలో తానూ ఒకడినని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు జనాభా అనుకూలత ఉందన్న చంద్రబాబు.. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు.

**మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం**

"ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాలు, సెన్సార్లు, ఐఓటీలు.. ఇలా చాలా టెక్నాలజీ వచ్చింది. ఇప్పుడు సమాజానికి కావాల్సింది పారిశ్రామికవేత్తలే. నేను నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నా.. చాలా మంది నాయకులను చూశాను. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ప్రధానిగా ఉన్నారు. మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం.

అమరావతిలో దేశంలోనే మొట్ట మొదటి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాను.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ ...(మిగతా 2లో)

# తిరుమలకు మరింత భద్రత

### డీజీపీ, టీటీడీ ఈవో ఉన్నత స్థాయి సమావేశం

**తిరుమల, విశాఖ సమాచారం:** దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తిరుమలలో భద్రత బలోపేతంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, టీటీడీ ఈవో జె.శ్యామలరావు సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో తిరుపతి ఎస్పీ, టీటీడీ ఇన్‌ఛార్జ్ సీవీఎస్‌వో హర్షవర్ధన్ రాజు భద్రతా అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోంగార్డు, సివిల్ పోలీసులు, తితిదే సెక్యూరిటీతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలన్నారు. అలిపిరి వద్ద బహుళ స్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలిసి సెన్సార్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.

ఈవో జె. శ్యామలరావు మాట్లాడుతూ.. భద్రతపై అనుబంధ ఏజెన్సీలతో ఒక సమన్వయ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. తిరుమలలో సైబర్ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. విస్తృతస్థాయిలో తిరుమల భద్రతపై సమీక్ష నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో అడిషనల్ డీజీ(లా అండ్ ఆర్డర్) సుధాకర్‌రెడ్డి, అడిషనల్ డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్హా, అనంతపురం రేంజ్ డీఐజీ డా.శేముషి, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, తితిదే అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆరు శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### 'మహానాడు' అద్భుతం.. అందరూ బాగా పనిచేశారు

### సీఎం చంద్రబాబు.. పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్



**అమరావతి, విశాఖసమాచారం:** కడపలో మహానాడు అద్భుతంగా జరిగిందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. జిల్లా నాయకత్వమంతా కలిసి పనిచేసి విజయవంతం చేశారని చెప్పారు. ఇందుకు కృషి చేసిన నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. సమష్టిగా చేస్తే ఏదైనా సాధ్యమని మహానాడుతో నిరూపితమైందన్నారు. మంత్రులంతా కార్యకర్తల్లాగా పనిచేసి స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. "మహానాడులో ప్రవేశపెట్టిన ఆరు శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నాం. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనపై ప్రజల్లో సానుకూలత ఉంది. ఎమ్మెల్యేలు కూడా విధిగా పేదల సేవలో పాల్గొనాలి. ప్రతిఒక్కరికీ సంక్షేమం అందేలా సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటిస్తాం" అని చంద్రబాబు తెలిపారు. శుక్రవారం చంద్రబాబు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలు, ...(మిగతా 2లో)



# 10న విశాఖకు రాష్ట్రపతి రాక

### ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

**అమరావతి, విశాఖ సమాచారం:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 10న విశాఖపట్నంలో జరిగే కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం మొదటి స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొనున్నారు. అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ...(మిగతా 2లో)

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం

### నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాల కల్పన

### డీఐఈపీసీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక ఔత్సాహికులకు అన్ని విధాలుగా పూర్తి సహకారం అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. ఔత్సాహికులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి, వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లు జిల్లాలో నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే నడుస్తున్న పారిశ్రామిక కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని, అక్కడ నుంచి వచ్చే వినతులపై వేగంగా స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గంగవరం పోర్టు నుండి నేషనల్ హైవే రోడ్డు కనెక్టివిటీ, ఏపీఐఐసీ ఇండస్ట్రీస్ నందు 30 వ్యక్తిగత యూనిట్లకు వాటర్ టాక్స్ , ఏపీఐఐసీ ఐలా, ఆటోనగర్ మరియు మధురవాడ ఐటి పార్క్ వద్ద బస్టాప్ ల ఏర్పాటు, ఏపీఐఐసీ ఐలా, ఆటోనగర్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రైవేటు వ్యక్తుల భారీ వాహనాల పార్కింగ్, పీఎం విశ్వకర్మ యోజన పథకం, సింగిల్ విండో క్లియరెన్స్ తదితర అంశాలపై చర్చించిన జిల్లా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం వి ఆదిశేషు, వివిధ పరిశ్రమల నిర్వాహకులు, ఐలా ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సినీ అవార్డుల్లో ఏపీ కూడా భాగస్వామ్యం కావాలి



### ఒక ఏడాది తెలంగాణ ఇస్తే.. మరో ఏడాది ఏపీ ఇవ్వాలి

### జ్యూరీ ఛైర్మన్ మురళిమోహన్ సూచన

### 2014-2023 వరకు గద్దర్ సినీ అవార్డుల ప్రకటన

**హైదరాబాద్, విశాఖ సమాచారం:** 2024 సంవత్సరానికి గాను గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డును గురువారం ప్రకటించిన ప్రభుత్వం శుక్రారం 2014 నుంచి 2023 వరకు తొమ్మిదేళ్ల కాలానికి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా జ్యూరీ ఛైర్మన్ మురళిమోహన్ మాట్లాడుతూ.. విభజన నాటి నుంచి నంది అవార్డులు ఇవ్వడం మానేశారని తెలిపారు. పదేళ్లలో సినీ అవార్డులను ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గద్దర్ పేరుతో అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఏపీలోనూ ప్రభుత్వం సినీ అవార్డులను ప్రకటించాలని కోరారు. ఒకే తెలుగు సినిమాకు రెండు ప్రభుత్వాలు అవార్డులు ఇవ్వడం బాగుండదని, రెండు ప్రభుత్వాలు ఒక అవగాహనకు వచ్చి ఒక ఏడాది తెలంగాణ ప్రభుత్వం, మరో ఏడాగి ఏపీ ప్రభుత్వం అవ్వార్డులు ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయన 2014-2023 వరకు గద్దర్ సినీ అవార్డను ...(మిగతా 2లో)



# 108 జంటలకు సామూహిక వివాహాలు

### ముఖ్యఅతిథిగా చిన్న జీయర్ స్వామి

**గొలుగొండ, విశాఖ సమాచారం :** ఒకే ప్రాంగణంలో 108 జంటలకు శుక్రవారం ఘనంగా వివాహాలు జరిపించారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవి పేటలో 108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. ఈ కార్యక్రమానికి త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. 108 జంటలకు ఆయన స్వయంగా మంగళసూత్రాలు అందజేశారు. ...(మిగతా 2లో)

# జూలై 9న సింహగిరి ప్రదక్షణ

### ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందితో సింహాచలం ఈవో త్రినాథరావు సమీక్ష



**సింహాచలం, విశాఖ సమాచారం:** సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జూలై 9న జరిగే గిరిప్రదక్షిణ విజయవంతం చేయాలని ఈవో వేంద్ర త్రినాథరావు పిలుపు నిచ్చారు స్వామివారి సింహగిరి ప్రదక్షణకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి కల్పించాల్సిన సదు పాయాలకు సంబంధించి శుక్రవారం ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ప్రధాన అర్చకులు సీతారామా చార్యులు, ఇతర ఆలయం అధికారులతో కొండపైన ఆనంద నిలయంలో ఈఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ లక్షలాది మంది భక్తులు గిరిప్రదక్షిణకు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. సింహ గిరిప్రదక్షిణ 32 కిలో మీటర్ల పొడవునా కాలి నడకన నగరమంతా జరగనున్నందున సంబంధిత అన్ని విభాగాలు ఈ ఉత్సవంలో భాగస్వాములను చేసే విధంగా లెటర్లు పంపాలని సూచించారు. ...(మిగతా 2లో)

# బ్రహ్మోస్‌తో శత్రువుకు నిద్రలేని రాత్రులు : మోదీ



**కాన్పూర్:** ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ ఆయుధ శక్తికి యావత్ ప్రపంచం కళ్లారా చూసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను మన క్షిపణి వ్యవస్థలు ధ్వంసం చేశాయన్నారు. బ్రహ్మోస్ క్షిపణులు.. శత్రువులకు నిద్రలేని రాత్రులు మిగిల్చాయని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్ సభలో మాట్లాడిన మోదీ.. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భారత సైన్యం పనితీరుపై ప్రధాని ప్రశంసలు కురిపించారు.

"ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. స్వదేశీ ఆయుధ సామర్థ్యం, మేకిన్ ఇండియా శక్తిని ఇది ప్రపంచానికి చూపించింది. పాకిస్థాన్‌లో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉగ్రస్థావరాలను నాశనం చేశాం. భారత ఆయుధాలు, క్షిపణి వ్యవస్థలు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి శత్రువులను గడగడలాడించాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాన్పుర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ఆయన.. అమేఠీలోని ఏకే203 రైఫిల్ ఉత్పత్తి ప్రారంభమైందన్నారు.

# వ్యక్తిగత కారణాలతోనే మిల్లా మ్యాగీ నిష్క్రమణ

## మిస్ ఇంగ్లండ్ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వ కీలక ప్రకటన

**హైదరాబాద్, విశాఖ సమాచారం:** మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణల వ్యవహారంపై విచారణ ముగిసిందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ అంశంపై తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ శుక్రవారం మాట్లాడారు. "మిస్ ఇంగ్లండ్ మ్యాగీపై తెలంగాణ ప్రభుత్వ విచారణ ముగిసింది. అయితే ఆమె విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదు. మిస్ వరల్డ్ నిర్వాహకులు లండన్‌లో కేసు వేశారు. ఆమెపై యూకే ప్రభుత్వమే లీగల్ చర్యలు తీసుకుంటుంది" అని జయేష్ రంజన్ స్పష్టం చేశారు. వ్యక్తిగత, నైతిక కారణాలను చూపుతూ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి నిష్క్రమిస్తూ మిల్లా మ్యాగీ స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారు. ఆపై ఆమె బ్రిటిష్ టాబ్లాయిడ్ ది సన్‌తో



మాట్లాడుతూ సంచలన ఆరోపణలు చేశారు. "హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా. తెలంగాణపై గౌరవం పెరిగింది. అక్కడి అతిథ్యం బాగుంది. కానీ, మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇవేం పోటీలు?" అని ఆమె అన్నట్లు సదరు టాబ్లాయిడ్ కథనం ఇచ్చింది. అయితే, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఛైర్మన్, సీఈఓ జూలియా మోర్లీ ఈ ఆరోపణలను ఖండించారు. తన తల్లి అనారోగ్యం కారణంగా కుటుంబ అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, అందుకే ఆమె పోటీ నుండి వైదొలగాలని అభ్యర్థించారని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలు.. గౌరవం, బ్యూటీ విత్ ఏ పర్పస్ విలువలకు కట్టుబడి ఉంది అని స్పష్టం చేశారు. అయితే ఈ వ్యవహారంపై తెలంగాణాలో రాజకీయ దుమారం రేగింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించాయి. దీంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

# ట్రాఫిక్ అంతరాయం లేకుండా యోగా డే నిర్వహించాలి

## ప్రధాన వేదికతో పాటు, అదనపు వేదికల వారీగా సమీక్షించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్టణం, విశాఖ సమాచారం:** జూన్ 21న విశాఖపట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే ప్రజలు ఆయా వేదిక వద్దకు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ అంతరాయం, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఆ రోజు కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసే వేదికలతో పాటు, అనువైన ప్రాంతాల్లో మరొక 25 అదనపు వేదికలు ఏర్పాటు చేస్తున్నామని అక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ పక్కా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. ఏ ప్రాంతం వారు ఏ కంపార్ట్మెంట్‌కు చేరుకోవాలి.. ఏ వాహనం ఎక్కడికి చేరుకోవాలి అనే అంశాలపై అందరికీ అవగాహన ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రధాన వేదికతో పాటు ఎంజీఎం గ్రౌండ్, వీఎంఆర్డీఏ పార్కు, అప్పుఘర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్, విశాఖ వ్యాలీ రోడ్డు, రుషికొండ, గీతం కళాశాల, సాయిప్రియ రిసార్ట్స్, ప్రేమ సమాజం, రామానాయుడు స్టూడియో కింది భాగంలో, కాపులుప్పాడ, చేపలుప్పాడ, భీమిలి హౌసింగ్ బోర్డు లేఅవుట్లో, ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని మైదానంలో యోగాసనాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లోని కార్యక్రమాలను ప్రధాన కార్యక్రమానికి అనుసంధానం చేస్తూ ప్రజలను భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు.

**సుందరీకరణ పనులు వేగంగా చేపట్టాలి**

కాళీమాత ఆలయం నుంచి భీమిలి డబుల్ రోడ్డు వరకు నిర్వహించే ప్రధాన వేదిక గూండా సుందరీకరణ పనులు, మరమ్మతులు చేపట్టాలని, విద్యుదీకరణ చేయాలని, రోడ్డు మధ్యలో ఇబ్బందికరంగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల మధ్యలో ఉండే డివైడర్లకు, పక్కన ఉండే గోడలకు చిత్రాలతో కూడిన రంగులు వేయాలని సూచించారు. మత్స్యదర్శినికి రంగులు వేయాలని, ఆ పక్కనే పాడు పడిన భవంతిని గ్రీన్ మాటీతో కవర్ చేయాలని చెప్పారు. రోడ్లకు ఇరువైపులా ఉండే డ్రెయిన్లను శుభ్రపరచాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లో విద్యుదీకరణ, టాయిలెట్లు, తాగునీరు, హెల్ప్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిని హోర్డింగులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పవర్ సప్లై, ఇంటర్ నెట్ సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే చదును చేసుకోవాలని, మొక్కలు తొలగించాలని సూచించారు. డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాథుర్, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 10న విశాఖకు రాష్ట్రపతి రాక

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుతం ఉన్న మినిట్ టు మినిట్ ప్రోగ్రాం ప్రకారం జూన్ 10వ తేది ఉదయం11.30 గంటలకు రాష్ట్రపతి విమానంలో విశాఖపట్నం చేరుకుని మధ్యాహ్నం 3 గం.ల వరకూ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.20 కి విశాఖపట్నం నుండి విమానంలో ర%ఖ%్బర?ండ్ రాష్ట్ర పర్యటనకు వెళతారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి వివిధ శాఖల పరంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన కార్యక్రమాల వివరాల మినిట్ టు మినిట్ కార్యక్రమం, డయాస్, బ్యాక్ డ్రాప్ తదితర డ్రాఫ్ట్ నివేదిక వివరాలను రూపొందించి రాష్ట్రపతి కార్యాలయం ఆమోదానికి పంపాల్సి ఉన్నందున వెంటనే అందుకు సంబంధించిన వివరాలను పంపాలని వర్చువల్ గా పాల్గొన్నకేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతి కట్టిమణిని సీఎస్ ఆదేశించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. ఈసమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, ఐటీ శాఖ కార్యదర్శి కె.భాస్కర్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్ గా రాష్ట్ర పోలీస్ డైరక్టర్ జనరల్ హరీశ్ కుమార్ గుప్త, విశాఖపట్నం జిల్లా కలక్టర్ హరీంధ్ర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మురుగుకాలువలో శిశువుల మృతదేహాలు

## తిరుపతి జిల్లాలో దారుణం



**గూడూరు, విశాఖ సమాచారం:** సభ్యసమాజం తలదించుకునేలా గర్భస్థ శిశువుల మృతదేహాలు మురుగుకాలువలో పడేసిన సంఘటన తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. కాలువలో చెత్త తొలగిస్తుండగా కవల శిశువుల మృతదేహాలను పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు గుర్తించారు. దీంతో వారు ఒకటో పట్టణ పోలీసులకి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గర్భస్రావం జరిగి ఎవరైనా తీసుకొని వచ్చి కాలువలో పడేశారా? లేక ప్రేమ పేరుతో మోసపోయి, గర్భం దాల్చిన తర్వాత అబార్షన్ చేయించుకొని పడేశారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

# త్వరలో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల సంఘాల ఏర్పాటు : సి.కల్యాణ్

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** నగరంలోని దొండపర్తిలో సినీ నిర్మాతలతో ఏపీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశానికి నిర్మాతలు స్రవంతి రవికిశోర్, సి. కల్యాణ్, సుధాకర్ రెడ్డి, భరత్ భూషణ్ తదితరులు హాజరవ్వగా.. సినిమా టికెట్లు, థియేటర్ల నిర్వహణ, పర్సంటేజీలపై చర్చించారు. భేటీ అనంతరం డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతల సంఘాల నుంచి కమిటీ ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు.

ఒక్కోసంఘం నుంచి 9 మంది చొప్పున 27 మందితో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు నిర్మాత సి.కల్యాణ్ తెలిపారు. కమిటీ సభ్యుల పేర్లు త్వరలోనే ప్రభుత్వానికి అందిస్తామన్న ఆయన.. ఆ వివరాలన్నింటినీ సోమవారం (జూన్ 2) మీడియాకు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. అలాగే సమావేశంలో ప్రస్తుతం డిస్ట్రిబ్యూటర్లు,



ఎగ్జిబిటర్లు ఎదుర్కొంటోన్న సమస్యలు, థియేటర్ నిర్వహణ, పర్సంటేజీలపై కూడా చర్చ జరిగిందని తెలిపారు. ఇకపై ప్రతినెలా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ఉంటుందని స్పష్టం చేశారు.

# రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు

## డీలర్లు సిద్ధం కావాలి : మంత్రి నాదెండ్ల

**విజయవాడ, విశాఖ సమాచారం:** ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి సిద్ధం కావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పనిచేయాలని కోరారు. గతంలో కార్డుదారుల కుటుంబాలకు కుటుంబ



పెద్దలా ఉన్న రేషన్ డీలర్లు అదే విధంగా ఇప్పుడు కూడా మనసుపెట్టి పనిచేసి లబ్ధిదారులకు గౌరవంగా సేవలందించాలన్నారు. రేషన్ దుకాణాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన తూకంతో సరకులు పంపిణీ చేయటం, ధరలు, స్టాక్ బోర్డ్, పోస్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో సైతం సరకుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోపే దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ సరకులు పంపిణీ చేసేందుకు చొరవ చూపాలని మంత్రి సూచించారు. వాట్సప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వల్ల కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడవచ్చున్నారు. ఒకవేళ ఎప్పుడైనా సాంకేతిక సమస్యలు ఎదురైనాసరే కార్డుదారులకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ-పోస్, వేయింగ్ మిషన్ల రిపేర్లకు సంబంధించి సర్వీసు క్యాంపులు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు.

# ఆ కార్లు ఎవరి కోసం కొన్నారు?

## లిక్కర్ స్కామ్ నిందితులకు సిట్ ప్రశ్నల వర్షం

**విజయవాడ, విశాఖ సమాచారం:** లిక్కర్ స్కామ్‌లో నిందితుల విచారణ తొలిరోజు ముగిసింది. సిట్ చీఫ్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో నలుగురు నిందితులను 8గంటల పాటు వేర్వేరుగా విచారించారు. కేసులో ఏ1 రాజ్ కెసిరెడ్డితో పాటు ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను రాజశేఖర్‌బాబు నేరుగా విచారించారు. స్కాంలో ఈ నలుగురి పాత్ర కీలకంగా ఉందని ఇప్పటికే సిట్ గుర్తించింది. స్కామ్‌లో వసూలు చేసిన డబ్బును ఎక్కడెక్కడ పెట్టుబడులుగా పెట్టారు? ఎక్కడ ఖరీదైన ఆస్తులు కొన్నారని ప్రశ్నించినట్లు సమాచారం. ఖరీదైన కార్లు ఎవరి కోసం కొన్నారని ప్రశ్నించారు. నిందితుల కుటుంబ సభ్యుల వ్యాపారాల్లో పెట్టుబడులుగా వచ్చిన డబ్బుల గురించి బ్యాంక్ ఖాతాల ఆధారంగా నిందితులకు ప్రశ్నలు సంధించారు. 2019-2024 మధ్య నిందితులు కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలను రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి సిట్ సేకరించింది. ఈ ఆస్తుల వివరాల ఆధారంగా సిట్ అధికారులు నిందితులను ప్రశ్నించారు.

# పారిశ్రామికవేత్తల ద్వారానే ..

(మొదటి పేజీ తరువాయి)

బిజినెస్ అంటున్నాను. విశాఖలో టీసీఎస్ మొదలవుతోంది.. ఆర్సెల్లార్ మిట్టల్ పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. విశాఖకు గూగుల్ రాబోతోంది. ఏపీలో గ్రీన్ ఎనర్జీకి మంచి అవకాశాలు ఉన్నాయి. సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ.. అన్నింటిలోనూ ఏపీ ముందు వరుసలో ఉంది. గ్రీన్ ఎనర్జీ కోసం ఎన్నో కంపెనీలు చాలా ఆసక్తిగా ఉన్నాయి. ఏడాదిలో రూ.5లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు అందుకున్నాం. ఈ ప్రాజెక్టుల ద్వారా నాలుగున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయి. మైనింగ్, టూరిజంలోనూ ఏపీలో మంచి అవకాశాలు ఉన్నాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటవుతోంది. 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే నా లక్ష్యం. గతంలో ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు వరుసగా 7-8 ఏళ్లు సీఐఐ సదస్సులు నిర్వహించాం. మొదటి నుంచి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ వచ్చాను" అని చంద్రబాబు వివరించారు.

# ఆరు శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ స్థాయి నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మహానాడు సక్సెస్ చేసిన నేతలకు అభినందనలు తెలిపారు. జూన్‌లో తల్లికి వందనం, అన్నదాత పథకాలు ప్రారంభిస్తామని , ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నామని మహానాడు వేదికగా చెప్పామని సీఎం గుర్తు చేశారు.

# జూలై 9న సింహగిరి ప్రదక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా జీవీఎంస, పోలీస్, వైద్య విభాగం తో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ప్రతి ఒక్కరూ తమ వంతు చేయూతను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబుకు తెలియచేశారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల కోసం కొండ చుట్టూ స్టాల్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవో తెలిపారు. వివిధ ప్రాంతాల్లో మొబైల్ టాయి లెట్లు ఏర్పాటు చేసేందుకు పారిశుద్ధ్యానికి సంబంధించి జీవీఎంసీ సహకారం తీసుకుంటున్నామన్నారు విద్యుత్ దీపాలు మంచినీటి సదు పాయంకు సంబంధించి కూడా సంబంధిత జీవీఎంసీ అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. భక్తులకు కల్పించాల్సిన మెరుగైన ఏర్పాట్లకు సంబంధించి వివిధ డిపార్ట్మెంట్ల వారితో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. కొండ దిగువన తొలి పావంచ నుంచి ప్రారంభమైన గిరిప్రదక్షిణ ఉత్సవం పాత అడవివరం, ముడసర్లోవ, హనుమంతవాక,జోడుగుల్ల పాలెం ప్రాంతాల మీదుగా సింహాచలం చేరుకుంటుందని తెలియజేశారు. గిరిప్రదక్షిణ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను పోలీస్ విభాగానికి చెందిన క్రైమ్, ట్రాఫిక్ ఏసీపీలు కంచరపాలెం, గోపాలపట్నం సీఐలు ఇతర ఉన్నతాధికారులు, ఇతర విభాగాల అధికారులతో త్వరలోనే సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తా మని తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు డీఈఓ ఎస్. రాధ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి, సహాయ కార్యనిర్వహణ అధికారులు తదితరులు హాజరయ్యారు.

# 108 జంటలకు సామూహిక వివాహాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ.. 108 జంటల వివాహ వేడుకకు హాజరవ్వడం చాలా సంతోషంగా ఉంది. నేను ఎవరి వివాహాలకు వెళ్లలేదు. మొదటిసారి ఆదివాసీల సామూహిక వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ రోజు చాలా ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ౼ ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొని నూతన జంటలను ఆశీర్వదించారు.

# సినీ అవార్డుల్లో ఏపీ కూడా భాగస్వామ్యం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. 2014 ఉత్తమ మొదటి చిత్రంగా 'రన్ రాజా రన్' ఉత్తమ ద్వితీయ చిత్రంగా పాఠశాల, ఉత్తమ తృతీయ చిత్రంగా అల్లుడు శీను నిలిచాయి. 2015 ఉత్తమ చిత్రంగా రుద్రమదేవి, ద్వితీయ చిత్రం కంచె, తృతీయ చిత్రం శ్రీమంతుడు అవార్డులను కైవసం చేసుకున్నాయి. 2016 ఉత్తమ చిత్రంగా శతమానం భవతి, ద్వితీయ చిత్రం పెళ్లిచూపులు, తృతీయ చిత్రం జనత గ్యారేజ్, 2017 ఉత్తమ చిత్రంగా బాహుబలి, ద్వితీయ చిత్రం ఫిదా, తృతీయ చిత్రం అవార్డు ఘాజీని వరించాయి.

ఇక 2018 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రంగా మహానటి, ద్వితీయ చిత్రంగా రంగస్థలం, తృతీయ చిత్రంగా కేరాఫ్ కంచెరపాలెం పురస్కారాన్ని కైవసం చేసుకున్నాయి. 2019కి గాను ఉత్తమ చిత్రంగా మహేశ్ బాబు నటించిన మహర్షి, ద్వితీయ చిత్రంగా జెర్సీ, తృతీయ చిత్రంగా మల్లేశం నిలిచాయి. 2020 సంవత్సరానికి గాను బెస్ట్ మూవీగా అల వైకుఠపురములో.., రెండో బెస్ట్ ఫిల్మ్‌గా కలర్ ఫొటో, తృతీయ చిత్రంగా మిడిల్ క్లాస్ మెలోడీస్, 2021 ఏడాదికి గాను ఉత్తమ చిత్రంగా ఆర్ఆర్ఆర్, ఉత్తమ ద్వితీయ చిత్రంగా అఖండ, తృతీయ చిత్రంగా ఉప్పెన అవార్డులు సొంతం చేసుకున్నాయి. 2022లో బెస్ట్ మూవీగా సీతారామమ్. సెకండ్ బెస్ట్ మూవీగా కార్తికేయా-2, మూడో ఉత్తమ చిత్రంగా మేజర్ నిలిచాయి. 2023లో ఉత్తమ చిత్రంగా బలగం, ద్వితీయ చిత్రంగా హనుమాన్, తృతీయ ఉత్తమ చిత్రంగా భగవంత్ కేసరి అవార్డులను దక్కించుకున్నాయి.

సినీ ఇండస్ట్రీకి అమూల్య సేవలందించిన మహానుభావుల పేరు మీద కూడా అవార్డులను ప్రకటించారు. స్పెషల్ జ్యూరీ అవార్డును ప్రజాకవి కాళోజీ, ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డును నందమూరి బాలకృష్ణ కైవసం చేసుకున్నారు. కాంతారావు అవార్డు విజయ్ దేవరకొండకు, పైడి జయరాజ్ అవార్డ్ మణిరత్నంకు, నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిలిం అవార్డు అట్లూరి పూర్ణచంద్రరావుకు, సుకుమార్‌కు బీఎన్ రెడ్డి ఫిలిం అవార్డు, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు యండమూరి వీరేంద్రనాథ్‌కు ప్రదానం చేయనున్నారు.

2nd pages1.qxd 5/30/2025 8:41 PM Page 3



# సీతంరాజు సుధాకర్ కు ఘన సన్మానం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఈ నెల 27 నుండి మూడు రోజులు పాటు కడప జిల్లాలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడుకు విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించి మహానాడు విజయవంతం అయ్యేందుకు తన వంతు కృషి చేసిన టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జి,రాష్ట్ర ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ను రాష్ట్ర మరపడవల సంఘం కార్యదర్శి, 35వ వార్డు టీడీపీ క్లస్టర్ ఇంచార్జి మున్నం బాలాజీ ఘనంగా సత్కరించారు.పార్టీ శ్రేణులు కడపకు రాక పోకలకు గాను తన సొంత ఖర్చులు భరించడంతో పాటు పార్టీకి 25 లక్షల రూపాయలు విరాళం ఇచ్చిన సందర్భంగా సుధాకర్ ను అభినందనలతో ముంచెత్తారు. సీతంరాజును శాలువాతో సత్కరించి పండ్ల బొకేను అందజేసి శుభాభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో సీతంరాజు మరింతగా రాణించి ఉన్నత పదవులు పొందాలని మున్నం బాలాజీ ఆకాంక్షించారు.జూన్ 10న జరుగు గంగాదేవి పండుగకు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు, కొండమ్మ,టీడీపీ నేతలు పెంటపల్లి సత్యనారాయణ, ఇ.సీతారాం భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 1 నుంచి రేషన్ డిపో డీలర్స్ వద్దే సరుకులు పంపిణీ

## - తహసీల్దార్ ఎం. లక్ష్మి



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** జూన్ 1 తేది నుండి రేషన్ కార్డు లబ్ధిదారులు అందరు రేషన్ సరుకులు ను పాత విధానం లో డిపో డీలర్స్ వద్ద రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఎం. లక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని రేషన్ డిపో డీలర్స్ తో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు అందజేశారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు పంపిణీ జరుగుతుందని , ప్రతి రేషన్ షాపు వద్ద డీలర్స్ సీసి కెమెరా లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఈ విషయం గమనించి డీలర్స్ వద్దనే రేషన్ సరుకులు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సిఎస్ డిటి ఈశ్వరరావు, డి టి మురళీధర్ రావు, రేషన్ డిపో డీలర్ లు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఒక వ్యక్తిపై దాడి !

## నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు !



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** రావికమతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వైన్ షాపు ఎదురుగా ఉన్న గెంజి అప్పారావు ఇంటి సమీపంలో ఉన్న షాపు వద్ద శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఒక వ్యక్తి, మరియు ఒక మహిళపై కొంతమంది దాడికి పాల్పడ్డారు. స్థానిక పాదచారులు సమాచారం మేరకు పూటుగా మద్యం సేవించిన కొంతమంది వ్యక్తులు గంజి అప్పారావు ఇంటి వద్ద ఉన్న షాపు వద్దకు వచ్చి కంచి పాటి స్వామి ఘర్షణకు దిగారు. ఇరు వర్గాల వాగ్వివాదం జరగడంతో ఆయన్ను తీవ్రంగా గాయపరిచారు. అడ్డుకున్న షాపు నిర్వాహకురాలుని జట్టు పట్టుకొని బి.యన్ రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి విచక్షణారహితంగా కొట్టినట్లు స్థానికులు తెలిపారు .ఘర్షణకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ సంఘటన జరిగిన వెంటనే హుటాహుటిన రావికమతం పిహెచ్సి కి గాయపడిన వ్యక్తిని తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపైన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

# అభిలాష్, తరీష్‌లకు ఘన నివాళులు



**పాయకరావుపేట, (విశాఖ సమాచారమ్):-** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముంజులూరి దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు పిల్లి అభిలాష్ , గంపల తరీష్ ఈ నెల 19 న మండలంలోని పెంటకోట బీచ్ లో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో జారిపడి మరణించిన సంగతి తెలిసిందే. ఈ యువకుల సంస్మరణ కార్యక్రమం (పెద్ద కార్యం) వీరి గృహం వద్ద కుటుంబ సభ్యులు పాత హరిజనవాడలో గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్న వయసులోనే అకాల మరణం చెందిన అభిలాష్ , తరీష్ లను గుర్తు చేసికొని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. వీరి జ్ఞాపకాలను నెమరువేసుకొని భోరున విలపించారు. వీరిని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అమరులైన యువకుల చిత్ర పటాలకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఏడిద సురేష్ , ఎంపిటిసి కశింకోట సత్తిబాబు, పార్టీ సీనియర్ నాయకులు దొంగల శ్రీను, బంగారి లక్ష్మణ్, మల్లవరపు ప్రదీప్, తుమ్మలపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 90 వ వార్డులో తారు రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ శంకుస్థాపన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖ నగర అభివృద్దే ధ్యేయంగా నగర పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ 8వ జోన్ 90 వ వార్డు పరిధిలోని లక్ష్మీ నగర్ సెయింట్ థెరిసా స్కూల్ తదితర ప్రాంతాలలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 190 లక్షలు వెచ్చించి పలుచోట్ల తారు రోడ్డు నిర్మాణం, సెంటర్ డివైడర్, కవర్ స్లాబ్, ఎం ఎస్ గిల్స్, పెయింటింగ్ మొదలైన పనులకు 90 వ వారు కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వార్డును అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుచిన్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధాని చేయాలన్న కృతనిత్యంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. 90వ వార్డు లక్ష్మీ నగర్ లో 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి తారు రోడ్డు నిర్మాణం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపన చేశామని, అలాగే వార్డులోని ప్రజలకు అవసరమయ్యే మరిన్ని మౌలిక వసతులు కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా చేపట్టడం జరుగుతుందని మేయర్ తెలిపారు.

అనంతరం స్థానికంగా ఉన్న శ్రీ పార్వతి చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 8వ జోన్ జోనల్ కమిషనర్ హేమావతి, కార్య నిర్వాహక ఇంజనీరు దిలీప్, ఉపకార్య నిర్వహక ఇంజనీర్ ప్రవీణ్ ,ఏఎంఒహెచ్ అప్పల నాయుడు, ఏపీడీ చిరంజీవి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

మెటీరియల్స్ సరఫరా

టెండరు నెం. 30255863, తేదీ. 28.05.2025

**వివరణ:** రోలర్ బేరింగ్ క్లీనింగ్ ప్లాంట్ టర్న్‌కీ పద్ధతిపైన స్పెసిఫికేషన్ నెం. COFMOW/BCP/2021 (REV-01), రిఫరెన్స్: అయిటం నెం. 153 ఆఫ్ COFMOW COMPENDIUM 2023-24 ప్రకారం (వారంటీ కాలం: డెలివరీ తేదీ తర్వాత 30 నెలలు) తనిఖీ చేయు వారు: TPI ఏజన్సీ, పరిమాణం: 1 నెంబరు. సూచన: మెటీరియల్ 60 దినములలోగా సప్లయి చేయవలెను.

టెండరు తెరచు తేదీ మరియు సమయం: 23.06.2025న 1500 గంటలకు.

పూర్తి వివరాలు లభించు వెబ్‌సైట్ www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్, వాల్తేరు

PR-184/Q/25-26


# వైయస్సార్సీపి నియోజకవర్గ నాయకులతో మాజీ ఎమ్మెల్యే సమావేశం

## జూన్ 4న బైక్ ర్యాలీ విజయవంతానికి పిలుపు



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి నాయకులతో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెద్ద బొడ్డేపల్లిలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన ఈ సమావేశంలో జూన్ 4న జరగనున్న వెన్నుపోటు దినం బైక్ ర్యాలీ పై చర్చించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, వైఎస్ఆర్సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో నర్సీపట్నంలో బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా 2024 ఎన్నికలలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను నెరవేర్చలేనందుకు నిరసనగా జూన్ 4న వెన్నుపోటు దినం అనే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా స్థానిక సిబిఎం కాంపౌండ్ నుండి పెద్ద బొడ్డేపల్లి జంక్షన్ వరకు బైక్ ర్యాలీ చేపడతామన్నారు. నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ తో పాటు నాలుగు మండలాల వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# పుణ్యశ్లోక అహిల్యబాయి హెూల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** శుక్రవారం ఉదయం పుణ్యశ్లోక అహిల్యబాయి హెూల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలు లో భాగంగా బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎంఎంఎన్ పరశురామ రాజు ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం తొలిపావంచా వద్ద నుండి బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత మరియు మహిళా శ్రేణులతో (చేనేత నడక) హ్యాండ్లూమ్ వాక్ సింహాచలం బస్సు కాంప్లెక్స్ వరకు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్ మధుకర్ జి మరియు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పివిఎన్ మాధవ్ విచ్చేసారు.

ఈ హ్యాండ్లూమ్ వాక్ అనంతరం సింహాచలం కాంప్లెక్స్ హాల్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పుణ్యశ్లోకా అహిల్యాబాయి ప్రజలకు చేసిన ఎన్నో సేవల గురించి కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి ఎ కేశవకాంత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. K. సుహాసిని ఆనంద్, బుద్ధ లక్ష్మీనారాయణ, బీజేపీ విశాఖ పార్లమెంట్ కన్వీనర్ ఎస్ఎ రామ్మోహన్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వత్సవాయి రోహిణి, కట్ట పద్మ, కామేష్ అయ్యగారి, కార్పొరేటర్ ముమ్మన దేముడు మరియు అధిక సంఖ్యలో మహిళామణులు పాల్గొన్నారు.

# చీపురుపల్లి, గరివిడిలో యోగా ర్యాలీలు

● విజయనగరంలో యోగా స్ట్రీట్ ● రామనారాయణంలో యోగా ప్రదర్శన ● విద్యార్థులకు యోగాంధ్ర పోటీలు



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి, గరివిడిలో మండల స్థాయి ర్యాలీలు, యోగా ప్రదర్శనలు శుక్రవారం జరిగాయి. వందలాదిమంది ఈ ర్యాలీల్లో పాల్గొని యోగా గొప్పదనాన్ని శిక్షకులు, గురువులు వివరించారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సాధించవచ్చునని చెప్పారు. అన్ని వయసులవారూ యోగా ఆచరించాలని కోరారు. ప్రతిఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపిడిఓలు, డిప్యుటీ ఎంపిడీఓలు, తాహసీల్దార్లు, వైద్యులు, ఇతర మండల స్థాయి అధికారులు, వెలుగు, ఐసిడిఎస్, ఉపాధి హమీ, వైద్యారోగ్య శాఖ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం విజయనగరంలో నిర్వహిస్తున్న యోగా స్ట్రీట్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రతీరోజూ ఒక ముఖ్య కూడలిలో యోగా స్ట్రీట్ పేరిట యోగాసన ప్రదర్శన నిర్వహిస్తున్నారు. స్థానిక గాంధీ బొమ్మ జంక్షన్‌లో శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగా స్ట్రీట్ జరిగింది. పట్టణ ప్రజలు, వివిధ వర్గాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీఒక్కరూ యోగా అభ్యసించాలని మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు.

ప్రముఖ పర్యాటక ప్రదేశం రామనారాయణంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన భారీ యోగా ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జెసి సేతు మాధవన్, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలను అభ్యసించారు.

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా మండల స్థాయి శిక్షణా కార్యక్రమం చివరిదశకు చేరుకుంది. టిఓటిలు, యోగా గురు, శిక్షకులు ఈ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ ఇచ్చారు. యోగాకు విస్తృత ప్రచారాన్ని కల్పించే ఉద్దేశ్యంతో యువత, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన్ పోటీలు జరుగుతున్నాయి. ప్రతీ మండలంలో పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను వెలికితీస్తున్నారు.

**భోగాపురం, పూసపాటిరేగలో నేడు ర్యాలీలు**

యోగాంధ్రకు విస్తృత ప్రచారం నిర్వహించే ఉద్దేశ్యంతో మండల స్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శనివారం ఉదయం భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ర్యాలీలు, యోగా ప్రదర్శనలు జరగనున్నాయి.

# కర్మ యోగి పుస్తక ఆవిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మరియు ఐఐపీఏ రీజనల్ బ్రాంచ్ ఛైర్మన్ ఎమ్.గోపాలకృష్ణ ఆంగ్లంలో రాసిన ' ఒక కర్మ యోగి జీవితం 'అనే పుస్తకం ఆవిష్కరణ ఎంవీపీ కాలనీ , ఐఏఎమ్ భవనంలో జరిగింది.

మాజీ ఐఏఎస్ అధికారి ఈ.ఏ.ఎస్.శర్మ చేతుల మీదుగా పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి మాజీ వైఛాన్సలర్, ప్రొ.ఆర్.సుదర్శనరావు, ఆది కవి నన్నయ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ముత్యాల నాయుడు, కుప్పం యూనివర్సిటీ మాజీ వైఛాన్సలర్ ప్రొ.కె.ఎస్.చలం, వైజాగ్ సీ పోర్ట్ వైస్ చైర్మన్ రాగం కిషోర్, ప్రొ.సాంబశివరావు ఐఐపీఏ సెక్రటరీ ప్రొఫెసర్ పేటేటి ప్రేమానంధం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని జిల్లా కలెక్టరు తెలియజేసారు. కావున ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులు సంబంధిత యాజమాన్యం నుండి పొందిన లేఖలను జిల్లా సమాచార పౌర సంబంధాల అదికారి కార్యాలయంలో అందజేసి, అక్రిడిటేషను కార్డులు పొడిగింపు చేసుకోవాలని తెలిపారు.

# స్వర్ణ పతక విజేత జ్యోతి యర్రాజీ ని అభినందించిన వావ్ పీఆర్ఓ వంశీ చింతలపాటి!



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** దక్షిణ కొరియాలోని గుమిలో జరుగుతున్న "ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025" లో విశాఖపట్నం అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకాన్ని గెలుచుకోవడంతో పాటు కొత్త ఛాంపియన్‌షిప్ రికార్డు నెలకొల్పారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.96 సెకన్ల టైమింగ్‌తో మొదటి స్థానం దక్కించుకున్నారు. భారతదేశ కీర్తి పతాకాన్ని ఎగరేస్తూ, దశ దిశలా వ్యాపిస్తూ, ఖండాంతరాలలో తన ప్రతిభను చాటుతున్న భారత అథ్లెట్ జ్యోతి యర్రాజీ విశ్వ విజేతగా ఎదగాలని ఆకాంక్షిస్తూ "వెటరన్ అథ్లెటిక్స్ అసోసిషన్ ఆఫ్ విశాఖపట్నం" పీఆర్ఒ చింతలపాటి వంశీ కృష్ణ వర్మ ఆమెకు అభినందనలు తెలిపారు.

# శృంగవరపుకోట ఉప కారాగారమును తనిఖీ చేసిన న్యాయమూర్తి



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** నేడు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ , విజయనగరం కార్యదర్శి డాక్టర్ ఏ. కృష్ణ ప్రసాద్ శృంగవరపుకోట ఉపకారాగారమును ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ ఏమైనా కేసుల సమస్యలు ఉన్న యెడల వాటిని జైలు సూపరింటెండెంట్ ద్వారా మండల న్యాయ సేవా కమిటీ శృంగవరపుకోట వారికి దరఖాస్తు ద్వారా తెలియజేయడమైతే తగిన పరిష్కారము చూపబడుతుందని ఈ సందర్భంగా తెలియజేసిరి. ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీయడం జరిగింది అలాగనే ఖైదీలకు ఏ రకమైన మెనూ ప్రకారము ఆహారాన్ని అందిస్తున్నారు తెలుసుకొని స్టోర్ రూమ్ను తనిఖీ చేయడం ద్వారా వాటి నాణ్యతను పరిశీలించడం జరిగింది. ఖైదీలకు కల్పిస్తున్న వసతులతో పాటు ప్రాంగణ పరిస్థితులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీల కే కాకుండా బయట వారికి కూడా ఉచిత న్యాయ సహాయం అందించడానికి ప్రతి కోర్టు ప్రాంగణంలో ఒక న్యాయ సేవా సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని వాటి ద్వారా ఎటువంటి రుసుము చెల్లించకుండా తగు ఉచిత న్యాయ సహాయమును పొందవచ్చునని అలాగనే అవసరమైన ఎడల ప్రభుత్వం వారిచే ఉచితముగా న్యాయవాదిని కూడా నియమించే సౌలభ్యం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. జూలై 5వ తారీఖున జాతీయ లోక్ అదాలతను నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ కక్షిదారులు ఈ అవకాశమును వినియోగించుకొని వారి యొక్క సివిల్, రాజీ ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా సూచించిరి. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటిండెంట్, జైలు సందర్శక న్యాయవాది టీ.వీ రమణమూర్తి ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో యువతరం ఎదగాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నతంగా రాణించాలని ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పిజి రాజశేఖర్ వ్యక్తం చేశారు. శుక్రవారం ఏయు చిత్రకళా విభాగంలో ఏర్పాటు చేసిన బిఎస్ఏ, ఎంఎస్ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శనను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఆంధ్ర విశ్వ కళాపరిషత్ లో అభ్యసించడం గర్వకారణమని చెప్పారు. విద్యార్థులు. సృజనాత్మకత, నైపుణ్యాలతో అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్ది ప్రదర్శించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న అంశాలను కార్యరూపంలో చూపుతూ తీర్చిదిద్దిన శిల్పాలు, చిత్రాలు అత్యుత్తమంగా నిలుస్తున్నాయని చెప్పారు.

విభాగాధిపతి డి.సింహాచలం మాట్లాడుతూ జూన్ 1వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని అన్నారు. విద్యార్థులు తయారుచేసిన శిల్పాలు, కళారూపాలు, చిత్రాలు ప్రదర్శించడం జరుగుతుందని అన్నారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించాలని కోరారు. కార్యక్రమంలో చిత్రకళా ప్రదర్శనను సందర్శించి న పలువురు స్థానికులు మహిళలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

2nd pages1.qxd 5/30/2025 8:41 PM Page 4




# విశాఖ సమాచారమ్

శనివారం 31-5-2025


## ట్రంప్ టారిఫ్‌లపై కోర్టు తీర్పు అమలయ్యేనా?

సర్వంసహాధిపత్యం కోసం ప్రపంచదేశాలపై టారిఫ్‌ల కొరడాను ఝుళిపిస్తున్న అగ్రరాజ్యాధినేత ట్రంప్‌కు అమెరికా ఫెడరల్ కోర్టు పగ్గాలువేసింది. యుద్ధంలాంటి అసాధారణ పరిస్థితులులేకపోయినా ఇష్టారీతిగా ప్రపంచదేశాలపై అధిక టారిఫ్‌ల భారం మోపడం చట్టప్రకారం కుదరని న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే మన్‌హాట్టన్ 'యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్' స్పష్టం చేసింది. ట్రంప్ వివిధ దేశాలపై అధిక టారిఫ్‌లు విధిస్తూ తీసుకున్న నిర్ణయాలను నిలుపుదలచేస్తూ జడ్జీలు తిమోథీ రెయిఫ్, జేన్ రెస్తానీ, గ్యారీ కట్జ్‌మన్‌ల ధర్మాసనం సంచలనాత్మక తీర్పును వెలువరించింది. విమోచనం దినం అంటూ దేశ చట్టాలను ట్రంప్ తన పరిధిదాటి ప్రయోగించారని న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 10 రోజుల్లోపు తీర్పులోని అంశాలను సంపూర్ణంగా అమలుచేయాలని ట్రంప్ యంత్రాంగానికి న్యాయస్థానం సూచించింది. దీంతో చైనాపై 30 శాతం అదనపు టారిఫ్, మెక్సికో, కెనడాలపై 25 శాతం టారిఫ్ అమలు నిలిచిపోనుంది. అయితే వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 ప్రకారం కార్లు, ఆటోరంగ విడిభాగాలు, స్టీల్, అల్యూమినియం తదితరాలపై విధించిన 25 శాతం టారిఫ్ మాత్రం కొనసాగనుంది.

"1977నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల (ఐఈఈపీఏ) చట్టం ప్రకారం తనకు దఖలుపడిన అధికారాలకు మించి మరీ అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచదేశాలపై అధిక టారిఫ్‌లను విధిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. జాతీయ భద్రతకు ముప్పు వంటి అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే అత్యయిక అధికారాలను ప్రయోగించాలి. వాస్తవానికి అత్యయిక అధికారాలను టారిఫ్‌ల కోసం ఉపయోగించకూడదు. వాణిజ్యలోటు అనేది ఏరకంగానూ అత్యయిక స్థితి అనిపించుకోదు. ప్రపంచదేశాల మాదిరిగానే అమెరికా సైతం గత 49 సంవత్సరాలుగా వరసగా వాణిజ్యలోటును చవిచూస్తోంది. హఠాత్తుగా వాణిజ్యలోటును సాకుగా చూపి అత్యయిక అధికారాలను ఇలా టారిఫ్‌ల విధింపు కోసం దుర్వినియోగం చేయకూడదు. అత్యయిక అధికారాలను అధ్యక్షుడు ఏకపక్షంగా తీసుకోకూడదు. అపరిమితంగా టారిఫ్‌ల విధింపు అధికారాన్ని ప్రదర్శించి అధ్యక్షుడు రాజ్యాంగంలోని ఇతర ప్రధానాంగాల అధికారాన్ని ఉద్దేశపూర్వకంగా లాక్కున్నారు. ఇది రాజ్యాంగవిరుద్ధం. అధ్యక్షుడి ధోరణి మేం ఏమాత్రం అనుమతించబోం. ఆర్థిక సంక్షోభాలొచ్చినా అధ్యక్షుడు రాజ్యాంగానికి లోబడే నిర్ణయాలు తీసుకోవాలి. ఏప్రిల్ రెండో తేదీన అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలను నిలుపుదలచేస్తున్నాం" అని న్యాయమూర్తులు స్పష్టంచేశారు.

విదేశాలకు తరలిపోయిన ఫ్యాక్టరీలు, కంపెనీల్లో ఉద్యోగాలను తిరిగి అమెరికాకు రప్పించేందుకే టారిఫ్‌ల అస్త్రాన్ని వాడుకున్నట్లు పదేపదే ట్రంప్ యంత్రాంగం చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. దేశ వాణిజ్యలోటు జాతీయ అత్యయిక స్థితిగా తయారవడంతో అమెరికాకు అనుకూలంగా వాణిజ్య నిర్ణయాలు తీసుకునేలా ఆయా దేశాలను భయపెట్టేందుకు, ఒప్పించేందుకు టారిఫ్‌ల ఆయుధాన్ని ఉపయోగించామని ప్రభుత్వంచేసిన వాదనను న్యాయస్థానం పట్టించుకోలేదు. 1971లోనూ నాటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ఇలా టారిఫ్‌లపై అత్యయిక అధికారాలను ఉపయోగించారు.

ఈ అధికారాలను సవాల్‌చేసే అధికారం కోర్టులకు లేదని, కేవలం పార్లమెంట్ మాత్రమే ప్రశ్నించగలదని ట్రంప్ సర్కార్ చేసిన వాదనను కోర్టు తిరస్కరించింది. తీర్పు తర్వాత వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కుశ్ దేశాయ్ మాట్లాడారు. " వాణిజ్యలోటు వంటి ఎమర్జెన్సీ పరిస్థితిని ఎలా చక్కబెట్టాలో నిర్ణయించాల్సింది ఇలాంటి జడ్జీలుకాదు. అదనపు పన్నులు విధించేందుకు ప్రభుత్వం తనకున్న ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోదు. ఎలాగైనా పన్నులు కొనసాగేలా చేసి దేశ వాణిజ్యలోటును తగ్గిస్తాం. మళ్లీ అమెరికాను గొప్పదానిలా మారుస్తాం" అని అన్నారు. అయితే కోర్టు తీర్పును గౌరవించి ట్రంప్ ప్రభుత్వం ఈ కొత్త టారిఫ్‌ల అమలును నిలుపుదల చేస్తుందా లేదా అనేది తేలాల్సి ఉంది. తీర్పును వెనువెంటనే ప్రభుత్వం వాషింగ్టన్ డీసీలోని 'యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఫర్ ది ఫెడరల్ సర్క్యూట్' కోర్టులో సవాల్‌చేసింది. తీర్పు అమలుకు కోర్టు 10 రోజుల గడువు ఇచ్చినందున ఈలోపు పైకోర్టు లో కేసు వాదనకు వచ్చేలాచేసి తీర్పు అమలుకాకుండా నిలుపుదల కోరొచ్చు. లేదంటే ఇప్పటికే అదనంగా వసూలుచేసిన టారిఫ్‌లను అమెరికా తిరిగి ఆయా దేశాలకు వడ్డీ కలిపిమరీ ఇచ్చేయాల్సి ఉంటుంది. తీర్పులో ట్రంప్ ప్రభుత్వానికి ఒక వెసులుబాటు ఇచ్చింది.

నిజంగానే దేశం అత్యంత క్లిష్టమైన వాణిజ్యలోటును ఎదుర్కొంటుంటే 1974నాటి వాణిజ్యచట్టంలోని సెక్షన్ 122 ప్రకారం అధ్యక్షుడు తనకు దఖలు పడిన అసాధారణ అధికారాలతో విదేశాలపై 15 శాతం వరకు అదనపు టారిఫ్‌లు విధంచవచ్చు. అయితే అవి తాత్కాలికమే. గరిష్టంగా 150 రోజులపాటు మాత్రమే ఈ అదనపు టారిఫ్‌లు అమలవుతాయి. 1977నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం పాచిక పారని కారణంగా ఈసారి వాణిజ్య చట్టం,1974 సెక్షన్ కింద టారిఫ్‌లు విధించాలని ట్రంప్ కొత్త ఎత్తుగడ వేయనున్నట్లు తెలుస్తోంది.

కాగా తన ప్రభుత్వం విధించిన సుంకాలు అమలుకాకుండా మాన్‌హట్టన్ ట్రేడ్ కోర్టు నిలుపుదల చేయడంపై ట్రంప్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తీర్పు రాజకీయ పక్షపాతంతో కూడుకున్నదని, అధ్యక్షుడి అధికారాలను న్యాయమూర్తులు అణగదొక్కారని మండిపడ్డారు.

## పంచాంగం

శనివారం 31-5-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత రుతువు
వైశాఖ మాసం

తిథి : శు. పంచమి రా. 8.16
నక్షత్రం : పుష్యమి రా. 9.07
వర్జ్యం : ప. 11.53 ల 1.20

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# పొగాకు వ్యతిరేక పోరాటం అందరి బాధ్యత

## నేడు ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం




ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) నిర్వహించే ఒక ముఖ్యమైన వార్షిక కార్యక్రమం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం. పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన పెంచడం, ప్రజలు ధూమపానం మానేయాలని ప్రోత్సహించడం దీని ఉద్దేశం. పొగాకు వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచడానికి, పొగాకు హానికరమైన ప్రభావాల నుండి సమాజాన్ని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సంస్థలను కోరడానికి ఇది ఒక అవకాశం.

ఏటా మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటారు. పొగాకు మహమ్మారి వల్ల కలిగే వ్యాధులు, మరణాలకు ప్రతిస్పందనగా ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్య దేశాలు 1987 లో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవాన్ని పాటించడం ప్రారంభించాయి. 1987లో ప్రపంచ ఆరోగ్య సభ (డబ్ల్యుహెచ్‌ఏ) ఏప్రిల్ 7ను "ప్రపంచ ధూమపాన రహిత దినం"గా నిర్వహించాలని పిలుపునిచ్చింది. మరుసటి సంవత్సరం, మే 31ని ప్రపంచ పొగాకు రహిత దినోత్సవంగా వార్షికంగా ప్రకటించింది. అప్పటి నుండి, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ప్రపంచ పొగాకు నిరోధక ప్రచారాలు ప్రారంభమయ్యాయి, పొగాకు ప్రమాదాలు, ఆరోగ్యంపై దాని ప్రతికూల ప్రభావం, అలాగే ముఖ్యంగా యువత కోసం ఉద్దేశించిన నికోటిన్ పరిశ్రమ దోపిడీ గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. వివిధ రకాల క్యాన్సరు, మరణాలతో సహా వివిధ పొగాకు సంబంధిత వ్యాధుల సంభవాన్ని తగ్గించడం, ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కూడా దీని లక్ష్యం.

ఈ సంవత్సరం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం థీమ్, పొగాకు పరిశ్రమ తన ఉత్పత్తులను ఆకర్షణీయంగా కనిపించేలా చేయడానికి ఉపయోగించే మోసపూరిత వ్యూహాలను ప్రజలకు తెలియజెప్పడం. రంగురంగుల ప్యాకేజింగ, సొగసైన డిజైన్ల నుండి రుచిగల వైవిధ్యాల, డిజిటల్ మార్కెటింగ్ వరకు, పొగాకు ఉత్పత్తులను ఉద్దేశపూర్వకంగా ఆకర్షణీయంగా కనిపించేలా రూపొందించారు, వాటి వెనుక ఉన్న ప్రాణాంతక పరిణామాలను దాచిపెడతారు.

ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం గత ఇతివృత్తాలు పొగాకుతో ముడిపడి ఉన్న ప్రపంచ ఆరోగ్య సవాళ్లపై ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క అభివృద్ధి చెందుతున్న దృష్టిని ప్రతిబింబిస్తాయి.

2023లో, "పొగాకు కాదు, ఆహారాన్ని పెంచండి" అనే ఇతివృత్తం ఆహార భద్రత, ఆరోగ్యం, పర్యావరణంపై పొగాకు వ్యవసాయం హానికరమైన ప్రభావాన్ని హైలైట్ చేసింది. పొగాకు నుండి స్థిరమైన ఆహార పంటలకు మారడంలో రైతులకు మద్దతు ఇవ్వాలని పొగాకు పరిశ్రమకు ఆజ్యం పోసే సబ్సిడీలను ముగించాలని ఈ ప్రచారం ప్రభుత్వాలను ప్రోత్సహించింది. 2024లో, "పొగాకు పరిశ్రమ జోక్యం నుండి పిల్లలను రక్షించడం" అనే థీమ్‌కి మారింది. ఈ ప్రచారం యువత గొంతులను విస్తృతం చేయడం, ఇ-సిగరెట్లు వంటి మార్కెటింగ్ వ్యసనపరుడ్కెన ఉత్పత్తుల ద్వారా పొగాకు పరిశ్రమ యువతను ఎలా లక్ష్యంగా చేసుకుంటుందనే దాని గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రపంచవ్యాప్తంగా 13 - 15 సంవత్సరాల వయస్సు గల 37 మిలియన్ల మంది పిల్లలు పొగాకును ఉపయోగిస్తున్నారని అంచనా వేశారు. కొత్త తరం వ్యసనంలో పడకుండా నిరోధించడానికి పరిశ్రమ ప్రభావం నుండి బలమైన రక్షణ కోసం ఈ ప్రచారం పిలుపునిచ్చింది.

2025 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం లక్ష్యం ఈ రోజును ప్రతిరోజు పొగాకు రహిత దినంగా మార్చడం, పొగాకు, నికోటిన్ పరిశ్రమలు తమ హానికరమైన ఉత్పత్తులను, ముఖ్యంగా యువతను ఆకర్షించడానికి ఉపయోగించే వ్యూహాలను బహిర్గతం చేయడం, వాటి గురించి అవగాహన పెంచడం. ఈ ప్రచారం పొగాకు, నికోటిన్ ఉత్పత్తులను తీసుకోవడం వల్ల కలిగే కఠినమైన పరిణామాలను కప్పిపుచ్చే రుచులు, సంకలనాలు. మోసపూరిత డిజైన్ల వాడకం వంటి పరిశ్రమ వ్యూహాలను బహిర్గతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది, తద్వారా యువతలో వారి ఆకర్షణ వ్యసనానికి గురయ్యే సామర్థ్యాన్ని పెంచుతుంది. 2025 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పొగాకు, నికోటిన్ పరిశ్రమలు యువతను ఆకర్షించడానికి ఉత్పత్తులను ఎలా రూపొందిస్తాయో బహిర్గతం చేయడంపై దృష్టి పెడుతుంది.

**భారతదేశంలో..**

భారతదేశంలో అనేక సామాజిక సంక్షేమ సంస్థలు సంవత్సరాలుగా అనేక పొగాకు వ్యతిరేక కార్యక్రమాల కోసం ప్రభుత్వ సంస్థలతో చేతులు కలిపాయి . 2005లో, భారతదేశం డబ్ల్యుహెచ్‌వో పొగాకు నియంత్రణపై ముసాయిదా సమావేశం (ఎఫ్‌టీటీసీ) లో భాగస్వామిగా మారింది. పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం (సీవోటీపీఏ) 2003, దేశంలోని ప్రాథమిక పొగాకు వ్యతిరేక చట్టం, దేశంలో అనేక పొగాకు నియంత్రణ విధానాలు అమలులో ఉన్నాయి. దీనికి తోడు, ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవంలో భాగంగా తీసుకున్న చర్యలు భారతదేశంలో పొగాకు నియంత్రణ ప్రయత్నాలను బలోపేతం చేశాయి.

సీవోటీపీఏ 2003 ప్రకారం, ఆసుపత్రులు, పాఠశాలలు, కార్యాలయ స్థలాలు, ప్రజా రవాణా, విద్యాసంస్థల వంటి బహిరంగ ప్రదేశాలలో ధూమపానాన్ని నిషేధించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచడానికి, పొగాకు ఉత్పత్తి , సరఫరాను నియంత్రించడానికి, పొగాకు వ్యతిరేక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడానికి 2007-08లో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్‌టీసీపీ) ప్రారంభించారు. భారతదేశంలో ఏ మాధ్యమంలోనైనా పొగాకు ఉత్పత్తులను ప్రకటించడం నిషేధించబడిరది. పొగాకు ఉత్పత్తుల ముందు ప్యాకేజింగ్‌లో 40% పొగాకు వినియోగం గురించి చిత్ర, పాఠ్య హెచ్చరికలను కలిగి ఉండాలి. 2019లో, ఒక కొత్త చట్టం అమలులోకి వచ్చింది. ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం, ఇది ఇ-సిగరెట్ల ఉత్పత్తి, నిల్వ, దిగుమతి, ఎగుమతి, రవాణా, అమ్మకం, పంపిణీ, ప్రకటనలను నిషేధిస్తుంది. ప్రతి మే 31వ తేదీని అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా మాత్రమే కాకుండా, ఏడాది పొడవునా ప్రతిధ్వనించే కార్యాచరణకు పిలుపుగా పరిగణించుకుందాం.

# సాహితీ వినీలాకాశంలో చలం ఒక సంచలనం

## చిరస్మరణీయులు

చలం తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక సంచలనం, విప్లవం. ఆయన రచనలు తెలుగు సాహిత్యంలో తుఫాను సృష్టించాయి. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని కుదిపేసిన ప్రముఖుడు. స్త్రీ వాద దృక్కోణం నుంచి సాహిత్యాన్ని మధించిన తాత్వికుడు గుడిపాటి వెంకట చలం. స్త్రీవాదానికి ఆద్యుడు చలిగా చెప్పవచ్చు. ఆడది తెగిస్తే మగవాడు జీరో అన్నాడు చలం. మహిళల మనోగతం,వారి భావాలను, అవసరాలను ఎవరూ అర్థం చేసుకోలేనంత అర్థం చేసుకున్న చలం అసలైన సాహిత్య శిఖరం. రచనల్లో ఇతివృత్తం,శైలి తాత్వికత ఆయనను గొప్ప రచయితగా నిలబెట్టాయి. ఆయన రచనలు స్త్రీల జీవితాలే ఇతివృత్తంగా ఉంటాయి.సమాజంలో వారు ఎదుర్కొనే కుటుంబ,మానసిక కష్టాలను ప్రముఖంగా ప్రస్తావించారు. గుడిపాటి వెంకట చలం రచయిత, వేదాంతి, సంఘసంస్కర్త. రచనల్లో అక్షర సత్యాల వెనుక నిగూఢమైన తాత్వికత తొంగి చూస్తుంది. తొలినాళ్లలో సాహితీ తిరుగుబాటు దారుడిగా ఉన్న చలం జీవితపు ఆఖరి అంకంలో తాత్వికత, అధ్యాత్మిక వైపు వెళ్లారు.

తాత్వికతకు నిదర్శనం "ప్రతి మనిషికి గిరి ఉంటుంది.నేను,నా సంసారం,నాయకులు,నావంశం,నా సంఘం,నా దేశం,నా మనుష్య జాతి అంటూ గిరిగీసుకోవడం ఎంత తక్కువైతే అంత నిర్మలత్వం,విశాల తత్వం ఏర్పడతాయి."

"రోజు సూర్యోదయాలు,సూర్యాస్తమయాలు అద్భుతంగా నెత్తి మీద జరుగుతుంటే..కళ్లు మూసుకుని సినిమాలో సూర్యోదయం చూపిస్తే..అర నిమిషం ఊపిరి బిగబట్టి అనందిస్తున్నావా..."

"ఏదో బతుకుతూ ఉండడం తప్ప. ఒకటి కావాలనిగానీ.. ఒక దాని నుంచి తప్పించుకుందామని గానీ గట్టిగా ప్రయత్నించడం చాలామంది మనుష్యులకి వింత.. రోజూ చేసే పనులే అట్లా తిరిగి తిరిగి చేస్తూ ఉండడం,ఏదైనా కష్టం వస్తే ఏడవడం, ఏమీ పట్టకుండా మనుష్యుల సంగతీ,పరిస్థితుల సంగతి అర్థం లేకుండా మాట్లాడటం ఇదే జీవితం."ఇలా చెప్పుకుంటూ పోతే చలం చెప్పిన జీవితసత్యాలు లెక్కలేనన్ని ఉన్నాయి.

ఆయన ప్రేమ వివాహాలను సమర్థించడంతో ఆగలేదు.ప్రేమలేని వివాహాలు విచ్ఛిన్నం అవడం ఖాయమని చెప్పారు.స్త్రీలు భర్తను వదిలి లేచి పోవడాన్ని సమర్థించారు.చలం ఒక స్వేచ్ఛా ప్రవక్త, విశృంఖల ప్రణయవాది, స్వాప్నికుడు,తిరుగుబాటు దారుడు, సుఖవాది అని ప్రచారం జరిగింది.ఆయన మాటల్లో"ప్రతి స్త్రీ కి భర్త అవసరమనే సంఘం ఎలాంటి వాడో తెలియని స్థితిలో కట్ట బెట్టడం, భర్త లేని స్త్రీని సంఘం ఒప్పుకోకపోవడం, మరి ఆ భర్తను కోల్పోతే మళ్లీ ఎందుకు వితంతువులకు ఇవ్వదు.ఒకవేళ పెళ్లిచేసుకున్న వితంతువులను ఎందుకు నిరాకరిస్తుందని నిలదీశారు.భర్త వద్దని గోల పెడుతున్న చిన్న పిల్లలకు బలవంతంగా కట్టబెడుతూ ఉందని ధ్వజమెత్తారు.తిరుగు బాటు చేసారు.రాముడిలాగా తన భార్యను విమర్శించిన వాడిని ఉపేక్షించరాదన్నాడు.కృష్ణుడిని సమర్థించారు. 16 వేలమంది భార్యలతో అలకలు, ఈర్ష్యా అసూయలు,తగాదాలు యుక్తిగా,తెలివిగా, రక్తి గా మెలగడం సమర్థించాడు చలం.రాముడు ఒక్కభార్యతోనే ఇన్ని సమస్యలా, కృష్ణుడికి అంతమంది ఉన్నా సమస్య లేదన్నారు.ఆయన చాలాకాలం బెజవాడ లక్ష్మి టాకీసు వద్ద ఇంట్లో ఉన్నారు.సినీ హాలు వారు వ్యాపారం పేరుతో అరమైలు వరకు శబ్దం వచ్చేలా చేసి చుట్టుపక్కల వారికి నిద్రలేకుండా చేస్తున్నారని,ఇది విని కొత్త ప్రేక్షకులు వస్తారని వారి వ్యాపార స్వార్థాన్ని వ్యాఖ్యానించడం విశేషం.

"మైదానం" నవలతో సమాజంలో ఒక్కసారిగా సంచలనం రేపారు.స్త్రీ స్వేచ్ఛ పేరుతో విశృంఖల జీవన విధానాన్ని ప్రచారం చేస్తున్నాడని,ఆయన కథల్లో బూతులు ఉన్నాయని ప్రచారం జరిగింది.ఆయనను సమాజం అపార్థం చేసుకుంది.ఆయన రచనలను బహిరంగంగా చదవడానికి భయపడ్డారు పాఠకులు. దాంతో ఆయన ఒక విపరీత వ్యక్తిగా పరిగణించేవారు. ఆయనతో ఎవరూ మాట్లాడేవారు కాదు.ఇల్లు అద్దె ఇచ్చేవారు కారు.బంధువులు కూడా దూరంగా ఉండేవారు.భార్య ఆయనను సమర్థించడం వల్ల ఆమె తల్లిదండ్రులు కూడా దూరం పెట్టారు. ఆర్య సమాజ భావాలను అర్థంచేసుకుని సహాయం చేసింది. కొంత కాలానికి వీరిమధ్య కీచులాటలు,మనస్పర్ధలు పెరిగాయి.టీచర్ శిక్షణ కోసం రాజమండ్రి వెళితే ఇల్లు ఇవ్వకపోవడంతో పశువుల పాకలో తలదాచుకున్నాడు. సంఘబహిష్కరణ వెలిని తానే కాక తన భార్య కూడా గురికావడంపై జాలి చూపేవాడు. తను ఒంటరీ,ఎక్కడికన్నా వెళ్దామంటే తనకీ ఎవరూ లేరని 'అన్నారు. "బిడ్డల శిక్షణ " అనే పుస్తకం రాసిన ఆయన జీవితంలో బిడ్డలు చేతికి అందకపోవడం దురదృష్టం. పెద్ద కొడుకు చిన్నతనంలో మరణించాడు.రెండో కొడుకు ఇల్లు వదిలి ఎటో వెళ్లిపోయాడు.కూతురు సన్యాసినిగా మారింది.సమాజం తనపట్ల చూస్తున్న చిన్నచూపు, రచనల వివాదం,వదిన అకాల మరణం ఆయనను కృంగదీసింది.బెజవాడలో ఇల్లు అమ్మి కుటుంబంతో అరుణాచలం వెళ్ళారు.అక్కడ రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్ళారు. జరుగుతున్న అన్యాయాలను తన రచనల్లో చూపిన మధనకు,బాధకు సమాజం నుంచి స్పందన రాకపోవడంతోఎంతో క్షోభపడి అరుణాచలం వెళ్లి పోయినట్లు కారణమయి ఉండవచ్చు. రమణమహర్షి ఆశ్రమంలో ప్రశాంతత చిక్కడంతో అక్కడే భగవద్గీతకు వివరణ రాసారు.అక్కడే భార్య రంగనాయకమ్మ మరణించింది. ఆయన అరుణాచలంలో 30ఏళ్లు నివసించి 1979 మే 4న అనారోగ్యంతో మరణించారు.ఆయన అంత్య క్రియలు కుమార్తె సౌరిస్ జరిపించింది. ఆయన మరణం తరువాత రచనలపై పత్రికల్లో పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి.

ఆయన 1894 మే 18న మద్రాసులో కొమ్మూరి సాంబశివరావు,సుబ్బమ్మ దంపతులకు జన్మించారు.తాతగారికి దత్తత రావడంతో ఇంటి పేరు గుడిపాటి గా మారింది.చిన్నతనంలోనే ఇతిహాసాలు,పురాణాలు చదివాడు.తల్లిని తండ్రి వేధించడం ఆయనపై తీవ్ర ప్రభావం పడింది.అక్కడే తిరుగుబాటుకు బీజం పడింది.చెల్లిపెళ్లి ఆగిపోవడం కూడా స్త్రీల పై జరుగుతున్న అన్యాయాలపై దృష్టి మళ్లింది.పిఠాపురంలో మహారాజా కళాశాల లో చదువుతున్నప్పుడు బ్రహ్మ సమాజం వైపు ఆకర్షితులయ్యారు.మద్రాసులో డిగ్రీ చదువుతూ 13 ఏళ్ల భార్యను కాన్వెంట్ లో చేర్చి చదివించాడు.బీఏ లిట్ చదివి కాకినాడలో ట్యూటర్ గా పనిచేసారు.రాజమండ్రిలోనూ పనిచేసేవారు,1920లో రచనా వ్యాసంగం ప్రారంభించారు.1930-40 లలో ఆయన రచనలు సమాజంలో ప్రభంజనం సృష్టించాయి .అప్పటి వరకూ స్త్రీల గురించి తెలుగులో ఏ రచయిత రాయలేదు.ఇప్పుడు కూడా ఆయన రాసిన దాంట్లో నూరోవంతు కూడా మహిళా రచయితలు కూడా రాయలేక పోవడం విశేషం.1972లో ఆత్మకథ రాసి దానికి చలం అని పేరు పెట్టారు.తానేదో గొప్పవాడని చెప్పుకునే ఆత్మకథలను విమర్శిస్తునే,అది క్షమించరాని విషయమన్నారు.శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం ముందు మాట రాసారు."యోగ్యతా పత్రం" అన్న పేరుతో రాసిన ముందు మాట తెలుగురచనల్లో అత్యంత ప్రసిద్ధమైనది. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ప్రభంజనం అయితే చలం తుఫానుగా భావిస్తారు.మైదానం,దైవ మిచ్చిన భార్య,ప్రేమ లేఖలు, స్త్రీ,మ్యూజింగ్స్,విషాదం, హరిశ్చంద్ర నాటిక చలం రచనల్లో ప్రముఖమైనవి.హరిశ్చంద్ర నాటికలో భార్యను అమ్ముతున్న హరిశ్చంద్రుని పిచ్చి పట్టిందని కట్టేసి తన్నే సీను ఉంది.

తన సమకాలిన రచయితలు గూర్చి ఆయన మాటల్లో" మునిమాణిక్యం రచనలు కులాసాగా చదవడానికి పనికివస్తాయి.విశ్వనాథ కవిత్వం నాకు అర్థం కాదు.కృష్ణశాస్త్రి తాను ఏదిఅనుభవించాడో అది రాస్తే అద్భుతంగా రాయగలరు.బసవరాజు అప్పారావు గొప్ప వాక్యం కోసం నూరు డబ్బాల చెత్త రాస్తాడని" వ్యాఖ్యానించారు.చలం రచనలను సినిమాలుగా తీయడానికి ఎవరూ సాహసించలేదు.గ్రహణం సినిమా వచ్చినా నిర్మాతకు ఆర్థికంగా కలిసిరాలేదు.మైదానం నవల తనికెళ్ల భరణి సినిమా తియ్యాలని ప్రయత్నించినా,చిత్రపరిశ్రమ నుంచి స్పందన కరువడంతో ఆయన విరమించుకున్నారు.చివరకు టెలీ ఫిల్మ్ గా తీసారు.ఏదిఏమైనా మనుష్యుడిగా ఆయనలో దౌర్భల్యం ఉన్నా అనేక విషయాలలో ఆయన విశిష్ట వ్యక్తి గానే గుర్తింపు పొందారు.ఆయన రచనల్లో పదును,తీవ్రత మరే రచయితకు సొంతంకాదని, ముఖ్యంగా మహిళల సమస్యలను చిత్రీకరించడంలో చలం సాటి మరొకరు లేరనేది సాహిత్యాభిమానుల మాట.

**యం.వి.రామారావు,8074129668**

# అనుకున్నట్లు రాసిన రచయిత్రి



ఆరు సంవత్సరాల వయసులో, బెవర్లీని మొదటి తరగతి తర్వాత ప్రొబేషన్‌లో ఉంచారు.

ఆమె ముందున్న అతిపెద్ద సవాలు - చదవడం!

తనకు చదువుకోవడానికి ఇచ్చిన పుస్తకాలు నీరసంగా పేలవంగా ఉన్నాయని ఆమె భావించింది. కొన్ని పుస్తకాల సారాంశం అతిగా ఉన్నాయనిపించాయట. నిజ జీవితానికేదీ అద్దం పట్టకపోవడంతో ఆమెను ఏ పుస్తకమూ అంతగా ఆకట్టుకోలేదు.

అయితే స్నేహపూర్వక పాఠశాల లైబ్రేరియన్ ఆమెకు భిన్నమైన పుస్తకాలిచ్చి చదివిస్తూ ప్రోత్సహిస్తూ చదివించాడు. ఈ క్రమంలో, బెవర్లీ పుస్తకాలను ఆస్వాదించడానికి ఒక కారణాన్ని కనుగొంది.

సంవత్సరాలు గడి చాయి. కళాశాల పట్టా పొందిన తర్వాత, బెవర్లీ తనకిష్టమైన పిల్లల లైబ్రేరియన్‌గా పని చేశారు. అయినా ఆమెలో పుస్తకాల విషయంలో ఓ మార్పు తీసుకురావాలని ఆశించింది. పిల్లల సాహిత్యం పేరిట వస్తునచన పుస్తకాలేవీ ఆమెను ఆకట్టుకోవడం లేదు.

ఓ కథలోని డిక్, జేన్ పాత్రలు ఆమెకు తెలిసిన నిజమైన పిల్లలను పోలి లేరు. కథాపాత్రలలో అల్లరి చేసే పిల్లలు, మొండి పట్టుదలగల పిల్లలు, ఆనందించే పిల్లలు, కొంటె పిల్లలు కనిపించడం లేదు ఆమెకు.

కాబట్టి, ఆమె ఒక నిర్ణయం తీసుకుంది: నిజమైన పిల్లలు నిజంగా ఆనందించగల పుస్తకాలను రాయాలని అనుకుంది. కలం పట్టింది.

రామోనా ది పెస్ట్, హెన్రీ హగ్గిన్స్, రిబ్సీ, ది మౌస్ అండ్ ది మోటార్‌సైకిల్ వంటి శీర్షికలతో ఆమె మొత్తం 40 కి పైగా పుస్తకాలు రాసింది.

ఆమె రాసిన కథలు డజన్ల కొద్దీ అవార్డులను గెలుచుకున్నాయి. 90 మిలియన్లకు పైగా కాపీలు అమ్ముడయ్యాయి. తరతరాలుగా ఆమె రచనలను ప్రేమించి ఆదరించే పాఠకులు ఉంటూనే ఉన్నారు.

ఒకప్పుడు చదవడాన్ని ద్వేషించే ఆ అమ్మాయి తానును కున్న రీతిలో కథలను నడిపించి బాల సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది.

ఓమారు బెవర్లీ ఇలా చెప్పింది...

"పిల్లలు నవ్వాలని కోరుకుంటారు. తమలాగే తప్పులు చేసి ఇబ్బందులు పడే ఇతరులు ఉంటూ ఉంటారు. అయినా జీవితంలో ఎవరి అనుభవం వారిదే"

బెవర్లీ పూర్తి పేరు బెవర్లీ అట్లీ క్లియరీ.

1916 ఏప్రిల్ 12,న జన్మించిన ఈమె 2021 మార్చి 25 తుదిశ్వాస విడిచారు. పిల్లలు, యువకుల కల్పనలను కథాంశాలుగా రచనలు చేసిన ఈమె అమెరికన్. అమెరికాలో అత్యంత విజయవంతమైన రచయితలలో ఒకరు. ఆమె మొదటి పుస్తకం 1950లో వెలువడి విశేష ఆదరణ పొందింది.

**- యామిజాల జగదీశ్**

# "దొంగలపై వ్యాసం"

ఒక టీచర్ తన 9వ తరగతి విద్యార్థులకు "దొంగలపై వ్యాసం" రాయమని హెూమ్ వర్క్ ఇచ్చింది. మొదట నవ్వొచ్చినా చివరకు ఇదే నిజమని మీరే మెచ్చుకుంటారు... దొంగలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి వారు, అది ఎలాగంటే... కేవలం దొంగల వల్ల మాత్రమే తాళాలు, బీరువాలు, కప్ బోర్డులు, లాకర్లు తయారుచేసేవారికి పని దొరుకుతుంది. ఇంటికి గ్రిల్లులు, కిటికీలు, వాకిళ్ళు తయారుచేసే వారికి కూడా పని దొరుకుతుంది. కాంపౌండ్ వాల్స్, గేట్స్ లాంటివి కేవలం దొంగల కొరకే కట్టడం జరుగుతుంది. వాచ్మాన్స్, పోలీసుకు ఉద్యోగాలు వస్తాయి. సిసి టీవీలు, మెటల్ డిటెక్టర్లు తయారుచేసే కంపెనీలు కోట్లు సంపాదించగలుగుతున్నాయి. గన్స్, బుల్లెట్స్ అమ్మికూడా సంపాదిస్తున్నారు. పోలీస్ స్టేషన్లు, కోర్టులు కట్టేవారికి ఉపాధి లభిస్తుంది. కోర్టు ఉద్యోగులు, జడ్జులు, లాయర్లకు ఉపాధి దొరుకుతోంది. ఒక దొంగ ఫేమస్ అయితే వాడి గురించి ప్రతిరోజు చూపించీ, చూపించీ టీవీ ఛానల్ల వారు తమ టి.ఆర్.పి. రేటింగ్స్ పెంచుకుంటారు. మొబైల్ ఫోన్లు, లాప్ టాప్ లు, సైకిళ్ళు, కార్లు, బైకులు కొట్టేసి అమ్మడం వల్ల కూడా ఒక సెకండ్ హ్యాండ్ మార్కెట్ సృష్టించబడుతుంది. కాబట్టి దొంగలు ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ఎంతగానో తోడ్పడతారు. ఈ వ్యాసం చదివిన టీచర్ ఎన్ని మార్కులు వేయాలో మీరే చెప్పాలి.

2nd pages1.qxd 5/30/2025 8:41 PM Page 5



## భర్త హింసలు భరించలేక విశాఖ వచ్చేసిన భార్య

### ఏయుటిడి సంస్థకు అప్పగించిన స్థానిక పోలీసులు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** కర్ణాటక రాష్ట్రం,ఊరు పర్జాపూర్, కొప్పల డిస్ట్రిక్ట్ కు చెందిన సావిత్రి, (30),అనే ఈమె విశాఖ వచ్చి రైల్వేస్టేషన్లో ఒంటరిగా తిరుగుతా ఉంటే, యస్.ఐ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు గమనించి జీవియంసి టి.యస్.ఆర్ మహిళా వసతి గృహానికి తీసుకుని వచ్చి అప్పగించారు. తన భర్త రోజు మద్యం సేవిస్తు చిత్ర హింసలకు గురి చేసి కొడుతున్నాడని, ఇంట్లో చెప్పాపెట్టకుండా విశాఖపట్నం వచ్చేసింది. వివరాలు నమోదు చేసి కుటుంబ సభ్యులను రప్పించే ప్రయత్నం చేయడం జరుగుతుంది. తాత్కాలికంగా షెల్టర్ లో వసతి కల్పించడం జరిగింది.

## బంధువుల చెంతకు పాలకొండ వాసి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** శ్రీకాకుళం జిల్లా, పాలకొండ కు చెందిన పసుమర్తి సింహాచలం (50),ఈ వ్యక్తి జ్ఞానాపురం రోడ్డులో ఫుట్ పాత్ పైన ఉంటే రోజు వారీ రెస్క్యూ ఆపరేషన్స్ లో గుర్తించడం జరిగింది. అతని మానసిక స్థితి సరిగా లేదని ఏయూటీడి సిబ్బంది జీవియంసి టి.యస్.ఆర్ షెల్టర్ కి తరలించడమైనది. శ్రద్ధా వారు ఇచ్చిన మందులతో త్వరగానే ఒత్తిడి నుంచి బయటపడ్డాడు. వివరాలడిగితే మహారాష్ట్ర చేపలు వేటకు వెళ్లి అక్కడ 2 నెలలు పని చేసినా, వాళ్లు డబ్బులు ఇవ్వకపోవడంతో కలత చెంది, టికెట్ లేకుండా రైలు ఎక్కి వైజాగ్ వచ్చేసానని చెప్పాడు. తనకి ముగ్గురు భార్యలు మరియు 5 గురు సంతానం అని తెలిపాడు. సింహాచలంని తీసుకుని శ్రీకాకుళం వెళ్ళగా వారి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో బంధువులకు అప్పగించి రావడం జరిగింది.

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** సిఐటియు 55 వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఫార్మాసిటీలో ఘనంగా నిర్వహించే జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు నాటి నుంచి నేటి వరకు కార్మిక హక్కుల రక్షణ కోసం కృషి చేస్తున్నదని నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతుందని దోపిడీ లేని సమాజం కోసం నిరంతరం కార్మికుల కోసం పనిచేస్తుందని మోడీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉండే కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలు మార్చుతుందని ఈ లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా కార్మికులందరినీ ఐక్యం చేసి జూలై 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే రమణ, సత్తిబాబు, జి చిట్టిబాబు, కే అప్పలరాజు, శేషు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాయామం చేస్తున్న సచివాలయం ఉద్యోగులు



**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):–** మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మూడవ రోజు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కామన్ యోగ ప్రోటోకాల్ ప్రకారం ప్రార్థన, ధ్యానం నందు సాధన చేశారు. వీరికి మాస్టర్ యోగి ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. యోగి ట్రైనర్లుగా శిక్షణా పూర్తి చేసిన అనంతరం సచివాలయ పరిధిలో ప్రజలకు వీరు శిక్షణ ఇవ్వనున్నారు.

## రిలయన్స్ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో...
## "సాంకేతికతతో సమన్వయంతోనే వ్యవసాయానికి భవిష్యత్తు"..





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):–** రిలయన్స్ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో అందించిన సాంకేతిక సలహాలతో వ్యవసాయంలో యువ రైతు మంచి దిగుబడులు సాధించారు. శ్రీకాకుళం జిల్లా కళ్లేపల్లి కి చెందిన 28 ఏళ్ల భీమ రాజు యువ రైతు. వ్యవసాయంపై ఆసక్తి ఎక్కువగా ఉండడం వలన ఇంటర్మీడియట్ తో చదువు ఆపేసి పూర్తిగా వ్యవసాయం వైపు మొగ్గు చూపారు. ఆ సమయంలో గ్రామంలో ఎక్కువ మంది రైతులు వయసు పైబడినవారే. యువకులు మాత్రం వ్యవసాయాన్ని ఆదర్శంగా చూడడం లేదు. దీనికి ముఖ్యమైన కారణం ం సహజముగా వ్యవసాయం అంతగా లాభదాయకంగా లేదన్నఅపోహ మరియు వారు పాతపద్దతులు ద్వారా వ్యవసాయం చెయ్యటం. అయితే దీనిని ఒక అవకాశంగా తీసుకుని, వ్యవసాయాన్ని నూతన దిశగా నూతన పద్దతులతో అభివృద్ధి చేయాలనే కోరికతో వ్యవసాయం చేయడానికి రైతు భీమరాజు ముందుకు వచ్చారు.

నాకు ఉన్న విద్య ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి అన్వయించాలి అనే ఆలోచన వచ్చింది. ఈ క్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ పరిచయమైంది. వారు మా గ్రామంలో ఎప్పటినుండో రైతు సదస్సులు నిర్వహించి, ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ద్వారా వివిధ సాంకేతిక విషయాలను, కొత్త పద్దతులను, కొత్త వంగడాల గురుంచి మరియు వివిధ సాంకేతిక విధానాలు ద్వారా అందిస్తున్నారు. వాటిని ఎల్లప్పుడూ ఆచరించి నేర్చుకొని, నా వ్యవసాయంలో అమలుచేయడం ద్వారా మంచి దిగుబడిని సాధించగలుగుతున్నాను. ఒక యువ రైతుగా నన్ను ఆ గ్రూపులో చేర్చారు.. ఒకసారి రిలయన్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపులో రబీ పంట అనంతరం "మొక్క జొన్నలో జీరో టిల్లేజ్" విధానాన్ని పరిచయం చేశారు. మేము గతంలో ఖరీఫ్లో వరి పంట వేసి, దాని తర్వాత వరి గడ్డిని కాల్చి వేసేవాళ్లం. ఇది భూమి రసాలను నాశనం చేసి పంట ఆ ప్రాంతములో అంతగా వచ్చేది కాదు. కానీ రిలయన్స్ వాట్స్ అప్ప్ అప్లికేషన్ ద్వారా, వాయిస్ మెసేజ్ ద్వారా శాస్త్రవేత్తల మీటింగ్స్ ద్వారా అలా చేయవద్దు అన్నారు. అప్పటినుండి వారు సూచించిన విధంగా, ఆ పాత గడ్డిని కాల్చకుండా పొలంలోనే ఉంచి, మిగతా భూభాగం మొత్తం పైకి పరిచి మొక్కజొన్న వేసాము. ఈ విధానం వల్ల నేలలో తేమ ఎక్కువ రోజులు నిలివడం వలన భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది, యూరియా, డీఏపీ, పొటాష్ వంటి రసాయనిక ఎరువులు వేయడం వల్ల ఎంత ప్రయోజనం చేకూరుతుందో నేలకు అంత సేంద్రియ పదార్థం అందింది. దానితోపాటు వాయు కాలుష్యం జరగకుండా వుంది. అంతే కాకుండా అది పంటకు కంపోస్ట్ క్రింద ఉపయోగ పడినది. దాని వలన ఎరువుల ఖర్చు సుమారుగా ఎకరానికి రూ. 10000 వరకు తగ్గింది. వరి గడ్డి ఒక సేంద్రీయ ఎరువులా పనిచేసింది. . ఈ పద్ధతిని అనుసరించటం వలన, నాకు ఉన్నమూడు ఎకరాల పొలములో 120 రోజుల వ్యవధిలో మునుపటి కంటే రూ.1,33,500 అదనపు ఆదాయం పొందగలిగాను. ఇప్పుడు మా గ్రామం లోని ఇతర రైతూ కూడా సాంకేతికత, శాస్త్రీయతో కూడిన యాజమాన్య పద్ధతులే లాభసాటి వ్యవసాయానికి శ్రీరామరక్ష అని నమ్ముతున్నారు.

## 'చాలా ఏళ్లుగా ఆ అలవాటు ఉంది'! వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై జైశంకర్ మాట




భారత విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌కు ఉన్న కుటుంబ నేపథ్యం ఏ మంత్రికీ ఉండకపోవచ్చు. ఆయన తండ్రి కే.సుబ్రహ్మణ్యం.. 1951 ఐఏఎస్ బ్యాచ్ టాపర్. ఆయన్ను చాలామంది కె.ఎస్ అని, సుబ్బు అని పిలుస్తుంటారు. అంతేగాదు భారత దౌత్య రంగానికి గురువు అని కూడా పిలుస్తారు. ఆ నేపథ్యం నుంచి వచ్చిన జై శంకర్ కూడా అంతే చురుకుగా ఉంటూ.. దూకుడుతో నిర్ణయాలు తీసుకుని అంద?ర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు. మరి అలాంటి వ్యక్తి జీవనశైలి ఎలా ఉంటుందో తెలుసా?..

వృత్తిపరంగా అత్యంత బిజీగా ఉండే జైశంకర్ రోజు తెల్లవారుజామున రెండు గంటల నుంచే మొదలైపోతుందట. ఎందుకంటే వివిధ దేశాలకు సంబంధించిన అంతర్జాతీయ కాల్స్, వార్తపత్రికలు సమాచారం తెలుసుకోవడం, ఆ రోజు ఉన్న ఈవెంట్లు, హాజరుకావల్సిన కార్యక్రమాలు షెడ్యూల్ చూసుకోడం వంటి గందరగోళంతో ఉంటుందట. అంత ఫుల్‌బిజీలో కూడా తనకున్న ఒక్క అలవాటే తన ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతుందట. అదే తన ఆరోగ్య రహస్యమని అంటున్నారు జైశంకర్.

ఎప్పుడే ఏ దేశంలో ఉంటామన్నది తెలియని పరిస్థితి కాబట్టి కచ్చితంగా వ్యాయామాలు, యోగా వంటివి చేయడం కుదరదని చెబుతున్నారు. అందువల్ల ఆయన దినచర్య తానున్న ప్రాంతాన్ని బట్టి మారిపోతుంటుందట. సాధారణ రోజుల్లో మాత్రం చాలామటుకు తన రోజు.. ఉదయం ఆరుగంటల నుంచి మొదలవ్వుతుందట.

అయితే కచ్చితంగా ఉదయం స్క్వాష్ గేమ్ ఆడతారట. ఎంత బిజీ షెడ్యూల్ అయినా..ఓ అరగంట అది ఆడాల్సిందేనని చెబుతున్నారు. అలాగే తప భార్యతో కలిసి ఓ అరగంట వాక్ చేస్తానన్నారు. ఎందుకంటే తన భార్యతో స్పెండ్ చేసేందుకు అదే తనకు తగిన సమయమని చెబుతున్నారు. అదీగాక నిత్యం పర్యటించే జై శంకర్‌కు కుటుంబంతో గడపడం, ఫిట్‌నెస్‌పై దృష్టిసారించడం అనేవి అత్యంత సవాలుతో కూడినవి.

కాబట్టి తన లైఫ్‌స్టైల్‌కి అనుగుణంగా ఆరోగ్యకరమైన అలవాట్లకు సంబంధించి కనీసం రెండు అలవాట్లను తప్పనిసరిగా తన దినచర్యలో భాగం చేసుకుంటారట. అలాగే కుటుంబంతో గడపటం కోసం..భార్యతో సంభాషిస్తూ చేసే వాకింగ్ అనేది కూడా తప్పనిసరి అని అన్నారు. పర్యటనలో లేకపోతే..తన భాగస్వామితో గడపటానికి తప్పనిసరిగా అరగంట సమాయాన్ని కేటాయిస్తానని చెప్పారు.

అలాగే తన వర్క్ లైఫ్ ఉదయం 9.30 గంటలకు మొదలవుతుందట. ఇక అక్కడ నుంచి ఉన్నత స్థాయి సమావేశాలు, సమీక్షలు, మంత్రిత్వ శాఖ ఫైళ్లను క్లియర్ చేయడం, పాశ్చాత్య దేశాలతో ఫోన్‌లో దౌత్య సంభాషణలు జరపడం వంటి కార్యక్రమాల్లో మునిగిపోతానని చెప్పారు. ఇక సినిమాలు చూసే ఛాన్సే లేదని అ?న్నారు. ఎందుకంటే.. రెండు గంటల్లో అయిపోయే సినిమా ఉండదు కదా అని నవ్వేశారు.

చివరగా ఆయన విదేశాంగ మంత్రిగా వర్క్‌కి సంబంధించి..24/7 అత్యంత బిజీగా ఉండాల్సిన పరిస్థితి అయినప్పటికీ.. వ్యక్తిగత జీవితం, ఆరోగ్యానికి సంబంధించిన ఆ అలవాట్లను మాత్రం ఎట్టిపరిస్థితుల్లో మిస్ అవ్వనని చెప్పారు. అంతేగాదు ఎంత పని గందరగోళంతో ఉన్నా..జీవితాన్ని అందంగా ఓ నిర్దిష్ట పద్ధతిలో నిర్మించుకోవడంలో విఫలమవ్వకూడదని అన్నారు జైశంకర్.

బిజీ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమే కానీ, జీవితాన్ని అందంగా మలుచుకోవడం అన్నది మన చేతుల్లోనే ఉంటుందని తేల్చి చెప్పారు విదేశాంగ మంత్రి జైశంకర్. చెప్పాలంటే వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అంటే అసలైన అర్థం మన విదేశాంగ మంత్రి లైఫ్‌స్టైలే కదూ..! సో.. మనం కూడా పని జీవితం తోపాటు..మన కుటుంబ జీవితానికి, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇద్దాం..ఆనందకరమైన జీవితాన్ని సొంతం చేసుకుందాం.

## లాడ్జిలపై కొరవడిన నిఘా

- సీపీ చెప్పినా తనిఖీలపై నిర్లక్ష్యం
- పలు స్టేషన్ల పరిధిలో కాసులకు కక్కుర్తి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కొన్ని లాడ్జిలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** నగరంలో కొన్ని లాడ్జిలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. తనిఖీలు చేయాల్సిన పోలీసులు కాసుల కక్కుర్తితో కళ్లుమూసుకుంటున్నారు. విశాఖకు ప్రతి రోజూ వేలాది మంది ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారు. ఈ నేపథ్యంలో లాడ్జిలకు ఎవరు వస్తున్నారు? వివిధ కేసుల్లో పరారీలో ఉన్న నిందితులెవరైనా ఇక్కడ ఉంటున్నారా? మైనర్లు, యువతీయువకులు గదుల్లో బస చేస్తున్నారా? విదేశీయులైతే సక్రమంగా పత్రాలు కలిగి ఉన్నారా? వంటివాటిపై ఆరా తీయాల్సి ఉండగా ఆ విషయాన్ని కొన్ని చోట్ల పూర్తిగా గాలికొదిలేశారు. సీపీ ఈ అంశంపై ఎప్పటికప్పుడు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

అప్‌లోడ్ చేసేలా: విశాఖ పరిధిలో సుమారు 300 లాడ్జిలు, వందకుపైగా గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి. స్టేషన్‌ల పరిధిలోని లాడ్జిల్లో సందర్శకుల వివరాలు రికార్డుల్లో నమోదు తరువాత వీఎంఎస్ యాప్‌లో అప్‌లోడు చేసేలా పోలీసులు పర్యవేక్షించాలి. వివరాలు వీఎంఎస్‌లో అప్‌లోడ్ చేయగానే పాత నేరస్థులైతే గుర్తించొచ్చు. ప్రధానంగా సీసీ కెమెరాలు ఉండేలా చూడాలి. ఒకవేళ మరమ్మతులకు గురైతే వెంటనే సరిచేయించాలి. ఇవేవీ పోలీసులకు పట్టడం లేదు. కొందరు పేకాట ముఠాలు, క్రికెట్ బెట్టింగ్ ముఠాలు లాడ్జిల్లో మకాం వేసి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. కొన్ని లాడ్జిల్లో యువతులను తీసుకువచ్చి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారు. గతంలో కొన్ని లాడ్జిలను కేంద్రాలు చేసుకుని గంజాయి వ్యాపారులు తమ కార్యకలాపాలు సాగించగా పట్టుకున్న విషయం విధితమే.

విశాఖ సున్నిత ప్రదేశం: విశాఖకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకుల తాకిడి ఎక్కువ. తూర్పు నౌకా దళం ప్రధాన స్థావరం ఇక్కడే ఉంది. హిందుస్థాన్ షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్ రిఫైనరీ, డాల్ఫిన్‌నోస్ వద్ద వ్యూహాత్మక ముడి చమురు నిల్వల కేంద్రం, వందల ఫార్మా కంపెనీలు, పోర్టులు ఉన్న ఎంతో సున్నిత ప్రదేశం. ఇలాంటి చోట గట్టి నిఘా అవసరం. ఇప్పటికే ఉగ్రవాద మూలాలుండి... విజయనగరంలో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు అనుమానిస్తూ సిరాజ్, సమీర్‌లను ఎన్‌ఐఏ కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలోనూ పేలవ తనిఖీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీస్ బాస్ ఆదేశిస్తేనే: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో ఈ ఏడాది మార్చి 10న 96 హొటళ్లు, లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సందర్శకుల వివరాలతో రికార్డులు నిర్వహించని లాడ్జిలు 2, వీఎంఎస్ (విజిటర్ మానిటరింగ్ సిస్టమ్)లో అప్‌డేట్ చేయనవి 14, సీసీ కెమెరాల్లేనివి 2 గుర్తించారు. తాజాగా జోన్–1, 2 పరిధిలో 80 హొటళ్లు, లాడ్జిలు తనిఖీలు చేయగా.. ఏడు చోట్ల సందర్శకుల సమాచారం రికార్డుల్లో పొందు పరచకపోవడం గమనార్హం.

## విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ కరెంట్ ఎఫైర్స్

**2025 మే**

**27 మే**

**అమెరికాలో ఘనంగా 'తెలుగు టైమ్స్' బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుల వేడుకలు**

అమెరికా న్యూజెర్సీలోని ఎడిసన్ పట్టణంలో 'తెలుగు టైమ్స్' బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు వేడుకలు మే 24, 25న జరిగాయి. అమెరికాలో విజయవంతంగా వ్యాపారాలు చేస్తున్న తెలుగు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రెండేళ్లుగా ఈ అవార్డులను అందిస్తున్నట్లు తెలుగు టైమ్స్ సంపాదకులు సుబ్బారావు చెన్నూరి తెలిపారు. తెలుగువారికి తెలుగు పత్రిక ఇవ్వాలనే ఉద్దేశంతో 2003లో తెలుగు టైమ్స్ పేపర్‌ను ప్రారంభించామన్నారు.

**25 మే**

**అమెరికా రక్షణ నిఘా సంస్థ నివేదిక**

పాకిస్థాన్‌కు సైనిక, ఆర్థికపరంగా చైనా నుంచి పూర్తి మద్దతు లభిస్తున్నా.. భారత్‌ను మాత్రం ఓ అస్తిత్వ ముప్పుగానే దాయాది దేశం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తన అణ్వాయుధాగారాన్ని ఆధునికీకరించుకుంటున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. 'వరల్డ్‌వైడ్ థ్రెట్ అసెస్‌మెంట్' పేరుతో అమెరికా రక్షణ నిఘా సంస్థ విడుదల చేసిన జాబితాలో ఈ విషయాన్ని వెల్లడించింది. "భారత్‌ను పాకిస్థాన్ అస్తిత్వ ముప్పుగా పరిగణిస్తోంది. భారత సైనిక శక్తిని దృష్టిలో ఉంచుకొని.. అణ్వాయుధాల అభివృద్ధి సహా సైనిక ఆధునికీకరణ ప్రయత్నాలు కొనసాగిస్తోంది.

**24 మే**

**మెన్సా ఐక్యూ ఛాలెంజ్‌లో భారత సంతతి కవలలు**

**అత్యధిక ఐక్యూ కలిగిన 0.26 శాతం మంది పిల్లల కోవలో స్థానం**

భారత సంతతికి చెందిన బ్రిటిష్ కవలలు ప్రసిద్ధ మెన్సా సంస్థ నిర్వహించిన అత్యున్నత స్థాయి ఐక్యూ (తెలివితేటల సూచిక) పరీక్షలో అగ్రస్థానంలో నిలిచారు. మెన్సా ఛాలెంజ్ పరీక్షలో 11 సంవత్సరాల క్రిష్ 162 పాయింట్లు పొంది అత్యధిక ఐక్యూ కలిగిన 0.26 శాతం మంది పిల్లల కోవలో స్థానం పొందాడు. ఆ బాలుడి సోదరి కైరా 152 పాయింట్లు సాధించి అత్యున్నత ఐక్యూ కలిగిన 2 శాతం చిన్నారుల కోవలోకి చేరారు. ఐక్యూ పరీక్షలో 140 పాయింట్లు సాధించిన పిల్లలు అసాధారణ ప్రతిభా పాటవాలు ఉన్నట్లు లెక్క.దిల్లీకి చెందిన అరోరా ఐటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ పిల్లల తండ్రి నిశ్చల్ ముంబయికి చెందిన ఎలక్ట్రానిక్స్ ఇంజనీరు. ఈ కుటుంబం 25 సంవత్సరాల క్రితం లండన్‌లో స్థిరపడింది.

**22 మేమారిషస్‌కు చాగోస్ దీవులను అప్పగించిన బ్రిటన్ ప్రకటించిన ప్రధాని కీర్ స్టార్మర్**

హిందూ మహాసముద్రంలోని చాగోస్ దీవులపై బ్రిటన్ తన సార్వభౌమత్వాన్ని మారిషస్‌కు బదిలీ చేసే ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. ఈ మేరకు చారిత్రక ఒప్పందంపై తాను సంతకం చేసినట్లు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ మే 22న ప్రకటించారు. దీంతో సుమారు రెండు శతాబ్దాలుగా ఆ ద్వీపసమూహంపై తమ ఆధిపత్యాన్ని బ్రిటన్ వదులుకున్నట్లైంది. ఈ దీవుల్లో అతిపెద్దదైన డీగో గార్సియా.. నేవీ, బాంబర్ స్థావరాలతో వ్యూహాత్మక స్థానంలో ఉంది. తాజా ఒప్పందం ప్రకారం ఆ దీవి భద్రతకు బ్రిటన్ బాధ్యత వహించనుంది. దీంతోపాటు ఆ స్థావరాన్ని కనీసం 99 ఏళ్లకు లీజుకు తీసుకొని, మారిషస్‌కు ఏడాదికి 136 మిలియన్ డాలర్లు చెల్లించనుంది.

అమెరికా దళాలు నిర్వహిస్తున్న ఈ రక్షణ స్థావరం భవిష్యత్తులో బ్రిటన్–అమెరికా భద్రత, నిఘా కార్యకలాపాల్లో కీలకం కానుందని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. చాగోస్ దీవులను బ్రిటన్ మారిషస్‌కు అప్పగించడాన్ని భారత్ స్వాగతించింది.

**21 మే**

**గోల్డెన్ డోమ్ ప్రాజెక్ట్**

**రూ.15 లక్షల కోట్లతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ**

భవిష్యత్తులో అమెరికా గగనతలంలోకి ఏ క్షిపణీ అడుగుపెట్టకుండా, ఏ అణ్వాయుధమూ సమీపించకుండా 'గోల్డెన్ డోమ్' అనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థ నిర్మించేందుకు ఆ దేశం శ్రీకారం చుట్టింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించారు. ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' తరహాలో అమెరికా కోసం 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ వ్యవస్థ నిర్మాణానికి 175 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15 లక్షల కోట్లు) ఖర్చవుతుందని పేర్కొన్నారు. దీంతో అమెరికా ఇక అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరించనుంది. యూఎస్ స్పేస్ ఫోర్స్ జనరల్ మైఖేల్ గుట్లీన్ ఈ 'గోల్డెన్ డోమ్' నిర్మాణాన్ని పర్యవేక్షిస్తారని ట్రంప్ తెలిపారు. ఇది తన పదవీ కాలం ముగిసేలోపు పూర్తవతుందని ట్రంప్ చెప్పారు.

ప్రపంచంలోని ఏవైపు నుంచి క్షిపణి ప్రయోగించినా, చివరికి అంతరిక్షం నుంచి దాడి చేసినా వాటిని అడ్డుకోగల సామర్థ్యం గోల్డెన్‌డోమ్‌కు ఉంటుంది.

**చైనా – పాక్ ఆర్థిక నడవా కాబుల్ వరకు విస్తరణ..**

చైనా – పాకిస్థాన్ ఆర్థిక నడవా (సిపెక్)ను అఫ్గానిస్థాన్‌లోకి విస్తరించాలని ఇరు దేశాల నేతలు నిర్ణయించారు. ఈ మేరకు బీజింగ్‌లో జరిగిన ఓ సమావేశంలో పాక్ ఉప ప్రధాని ఇసాక్ దర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ, అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తాకీ చర్చలు జరిపారు. ఈ భేటీలో సిపెక్ విస్తరణపై నిర్ణయం తీసుకున్నట్లు పాక్ విదేశాంగశాఖ ప్రకటించింది.

**20 మే**

**ప్రపంచ మహమ్మారి వ్యతిరేక ఒప్పందం**

భవిష్యత్తులో తలెత్తే మహమ్మారులను సమర్థంగా, సమైక్యంగా ఎదుర్కొనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సభ్యదేశాలు తొలిసారిగా 2025, మే 20న ప్రపంచ మహమ్మారి వ్యతిరేక ఒప్పందం కుదుర్చుకున్నాయి. కొవిడ్–19 సంక్షోభం అనంతరం మూడేళ్లుగా సాగుతున్న చర్చలకు పర్యవసానంగా ఈ ఒప్పందం కుదిరింది.

'డబ్ల్యూహెచ్‌వో ప్యాండమిక్ అగ్రిమెంట్'కు ప్రపంచ ఆరోగ్య సమ్మేళనం ప్లీనరీ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంపై జరిగిన ఓటింగులో 124 దేశాలు అనుకూలంగా ఓటేయగా, 11 దేశాలు గైర్హాజరయ్యాయి. దీనిపై ఏ ఒక్క దేశమూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది.

78వ ప్రపంచ ఆరోగ్య సమ్మేళనంలో తీసుకున్న ఈ నిర్ణయంతో మూడేళ్లుగా సాగుతున్న చర్చలు చివరి స్థాయికి చేరాయి. మహమ్మారులను ఎదుర్కొనేందుకు మరింత మెరుగైన సమన్వయం సాధించేందుకు ఈ ఒప్పందం సాయపడుతుంది.

– డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి
విశాఖ సమాచారమ్ 9553574250

2nd pages1.qxd 5/30/2025 8:41 PM Page 6



## జవహర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సై టి.రామకృష్ణ



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):- ( నియోజకవర్గ బ్యూరో కొల్లి చిన్నబాబు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టబోతున్న మాజీ మంత్రి కె.ఎస్ జవహర్ ని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ కొవ్వూరు పట్టణం లోని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేసారు.

## భక్తురాలిపై ఆలయ అధికారి అసభ్య ప్రవర్తన

### ఆలస్యంగా అందిన ఫిర్యాదుతో విచారణ

**అన్నవరం:** అన్నవరం ఆలయంలో రోజుకో వివాదం వెలుగుచూస్తోంది. ఇటీవల సత్యదేవుని కల్యాణమహోత్సవాల సందర్భంగా శ్రీపుష్పయోగ మహోత్సవం జరిగింది. ఆ సమయంలో ఆలయ అధికారి కొండలరావు ఓ భక్తురాలి ఎడల అసభ్యంగా ప్రవర్తించారని ఉన్నతాధికారులకు హైదరాబాద్‌కు చెందిన ఆమె భర్త ఫిర్యాదు చేశారు. అందులో పేర్కొన్న వివరాలివీ.. ఈ నెల 13న ఆ దంపతులు వ్రతం పూర్తైన తర్వాత అదేరోజు సాయంత్రం స్వామివారి శ్రీపుష్పయోగ మహోత్సవం ఉందని తెలుసుకున్నారు. దీంతో ఆ రోజు సాయంత్రం హైదరాబాద్ తిరుగుప్రయాణాన్ని రద్దు చేసుకుని ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవం ముగిశాక ప్రసాదం తీసుకునేందుకు వెళు_న్నప్పుడు విధుల్లో ఉన్న ఆలయ అధికారి కొండలరావు తన భార్యను నెట్టి అసభ్యంగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై అప్పుడే ఈవోకు ఫిర్యాదు చేయాలని భావించినా అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్ వెళ్లిపోయామని వివరించారు. ఫిర్యాదుపై విచారణాధికారిని నియమించి విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఈవో సుబ్బారావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

## సిఐటియు జెండా ఆవిష్కరణ




**అచ్చుతాపురం, (విశాఖ సమాచారమ్):-** సిఐటియు 55 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అచ్చుతాపురం జంక్షన్లో సిఐటియూ జెండా ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, మండల కన్వీనర్ కే. సోమినాయుడు మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు నాటి నుంచి నేటి వరకు కార్మిక హక్కుల రక్షణ కోసం కృషి చేస్తున్నదని నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతుందని దోపిడీ లేని సమాజం కోసం నిరంతరం కార్మికుల కోసం పనిచేస్తుందని మోడీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉండే కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలు మార్చుతుందని ఈ లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా కార్మికులందరినీ ఐక్యం చేసి జూలై 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని లేబర్ కోడ్స్ ను తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల అధ్యక్షులు కర్రీ .నాయుడు ,శ్రీ చౌడమాంబిక ఆటో యూనియన్ నాయకులు రమేష్, గణేష్ ,వి .ప్రకాష్, రావాడ. శ్రీను, హనుమంతు, ఏ. కొండలరావు పాల్గొన్నారు.

## వర్ర గ్రామంలో తాగునీటి కష్టాలు



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** అరకులోయ మండల పరిధిలోని శిరాగం పంచాయతీకి చెందిన వర్ర గ్రామాన్ని తాగునీటి దాహం కాస్తా విలవిలలాడిస్తోంది. గత వారం రోజులుగా గ్రామంలోని కొళాయిలకు నీరు రాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ పరిస్థితి గిరిజన గ్రామస్తులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

నీటి కోసం ఇంటి వద్ద వేచి ఉండటం ఫలించక, సమీపంలోని ఊటలవద్దకు పయనమవుతున్నామంటూ స్థానికులు వాపోతున్నారు. అయితే అక్కడ లభిస్తున్న నీరు తాగడానికి సరిపడదని, దాంతో జ్వరాలు, విరేచనాలు వంటి వ్యాధులు విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

"తాగునీరు లేకపోవడం వల్ల మా పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఊటల నీరు శుభ్రంగా ఉండకపోవడంతో జ్వరాలు వస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పరిస్థితి మరింత విషమంగా మారుతుంది," అని గ్రామస్తులు గళమెత్తారు.

ప్రాథమిక అవసరమైన తాగునీటి సౌకర్యం లేకపోవడం పట్ల గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, గ్రామానికి నిరంతరంగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# పదమూడేళ్లకే ఆంగ్ల కాల్పనిక నవల రచన

- ప్రత్యేకత చాటిన రాజమహేంద్రి వాసి మహీరమ
- ఆవిష్కరించిన నన్నయ విశ్వవిద్యాలయం వీసీ



**రాజానగరం:** పిట్ట కొంచెం.. కూత ఘనం అంటే ఇదేనేమో.. 13 ఏళ్ల వయసుకే ఏకంగా ఆంగ్ల కాల్పనిక నవల రాసి ప్రత్యేకత చాటడం రాజమహేంద్రవరం నగరానికి చెందిన చల్లా మహీరమకే చెల్లింది.. ప్రకృతి, పంచభూతాలు కథాంశం గా, చిన్నారులు పాత్రధారులుగా ఆంగ్లంలో 'రూబీస్ బ్లూ స్ట్రీమ్ అండ్ ది బాండ్ ఆఫ్ ఫైర్' పేరుతో ఆసక్తికరంగా కథన రచన చేశారామె. ప్రముఖ వైద్యులు చల్లా వెంకట సుబ్బయ్యశాస్త్రి (సీవీఎస్ శాస్త్రి) మనవరాలే మహీరమ. సీవీఎస్ శాస్త్రి కుమారుడు రోషన్ కృష్ణ, వెంకట సాయిసుధ దంపతుల కుమార్తె. ఆరో ఏట వరకు అమెరికాలో పెరిగిన ఆమె.. ప్రస్తుతం తండ్రి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉండటంతో అక్కడే తొమ్మిదో తరగతి చదువుతున్నారు. తన వయసు పిల్లలంతా సెల్‌ఫోన్లతో బిజీగా గడుపుతోన్న ఈ కాలంలో మహీరమ మాత్రం ఎనిమిదో ఏట నుంచే రచనా వ్యాసంగాన్ని చేపట్టడం గమనార్హం. కర్ణాటక గాత్ర సంగీతంలోనూ నాలుగో గ్రేడ్ శిక్షణ పొందుతుండగా.. కీబోర్డ్, చిత్రలేఖనం, సొంతంగా పాటలు రాస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుపొందారు. మహీరమ రాసిన పుస్తకాన్ని గురువారం నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వీసీ ప్రసన్నశ్రీ ఆవిష్కరించారు. చిన్న వయసులోనే ఫిక్షన్ నవలను రాసి రికార్డు సృష్టించిందని వీసీ కొనియాడారు. ఈ సందర్భంగా మహీరమను వీసీ శాలువాతో సన్మానించి, అభినందించారు. రచయిత్రి మహీరమ మాట్లాడుతూ ప్రకృతితో మానవుడి అనుబంధం, ప్రకృతికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఏర్పడే పర్యవసానాలు, జీవిత గమ్యాన్ని ఈ రచనల ద్వారా చెప్పానన్నారు. ప్రకృతి అంటే తనకెంతో ఇష్టమని అందుకే తాను అనుభూతి చెంది నవలలు రాస్తున్నానని తెలిపారు. లండన్‌లో ఉంటున్న గంధం పావన ఈ నవల ఆకట్టుకునేలా కవర్ పేజీని రూపొందించారని తెలిపారు. 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన వీసీ ఎస్.ప్రసన్నశ్రీ తన పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మహీరమ తల్లి సాయిసుధ, అమ్మమ్మ, తాతయ్యలు గోపాలమ్మ, ఏవీఎస్ రాజు, స్పృహ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర నాగేంద్ర కిషోర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధ.. అవకాశాల సంపద

**గాంధీనగర్ (కాకినాడ):** ప్రస్తుతం ఎక్కడ చూసినా కృత్రిమ మేధనే. అన్ని రంగాల్లో విస్తరిస్తున్న ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, మెషిన్ లెర్నింగ్‌లో నైపుణ్యం సాధించిన విద్యార్థులు మంచి ప్యాకేజీలతో ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. ఈ సందర్భంగా వాటి అవసరం, అందులోని అంశాలు, ఉపయోగాలు తదితర అంశాలపై జేఎన్‌టీయూకే ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ఏఎస్ఎన్.చక్రవర్తి పలు విషయాలు 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారిలా..



**జేఎన్‌టీయూకేలో కోర్సులు..**

మనం ఇచ్చిన కమాండ్ ఆధారంగా ఏఐ ఫలితాలు అందిస్తుంది. నేర్చుకోవడం, ఆలోచించడం, నిర్ణయం తీసుకోవడం, సమస్య పరిష్కారం వంటి పనులను సొంతంగా నిర్వహిస్తుంది. ఇందులో ప్యాటర్న్ రికగ్నేషన్, మెషిన్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్, బిగ్ డేటా, సెల్ఫ్ ఆల్గారిథమ్ తదితర సాంకేతికతలు ఉన్నాయి. తొలుత ఇందులోకి నిర్దిష్ట డేటాను ఫీడ్ చేస్తారు. ఆపై వివిధ పరిస్థితులకు అనుగుణంగా అది స్పందిస్తుంది. ఆటోమేషన్, ఏఐ, రోబోటిక్స్ సాంకేతికతలు సంబంధం కలిగి ఉన్న వేర్వేరు అంశాలు. కృత్రిమ మేధలోనే మెషిన్ లెర్నింగ్ అనేది ఓ భాగం. జేఎన్‌టీయూకే, అనుబంధ కళాశాలల్లో ఏఐ, ఎంఐ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

**గణితం, ప్రోగ్రామింగ్‌పై ఆసక్తితో..**

ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్, ఏఐ అండ్ ఎంఎల్ అంశాలతో కంప్యూటర్ సైన్స్ ఉంది. ఏఐఅండ్ఎంఎల్ స్పెషలైజేషన్‌తో నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఉంది. ఇందులో ఎం.ఐ. ఆల్గారిథమ్‌లు, డీప్ లెర్నింగ్, డేటా సైన్స్, కంప్యూటర్ విజన్ తదితర అంశాలు ఉంటాయి. బీటెక్ స్థాయిలోనే బలమైన పునాదులు వేసుకోవడం మంచిది. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఆచరణాత్మక అనుభవం అవసరం. ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుంది. గణితం, ప్రోగ్రామింగ్‌పై ఆసక్తి ఉండి నిరంతర అభ్యాసం, పోటీతత్వం లక్షణాలు ఉంటే ఇందులో రాణించొచ్చు. ఇందులో నైపుణ్యం సాధించిన వారికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలు లభిస్తున్నాయి.

**మంచి డిమాండ్..**

దేశీయంగా వివిధ పరిశ్రమల్లో ఏఐ సామర్థ్యం, కార్యాచరణకు సంబంధించి నీతిఆయోగ్ ఇటీవల జాతీయ కృత్రిమ మేధస్సు విధానాన్ని రూపొందించింది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, రవాణా, స్మార్ట్‌సిటీలు, వైద్యం, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో దేశ అవసరాలను తీర్చడానికి ఇది ఉపయోగపడుతుంది. 2027 నాటికి దేశ ఏఐ మార్కెట్ 71.0 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచ ఐటీ మౌలిక సదుపాయాలు భారత్‌లో కేంద్రీకృతమై ఉన్నాయి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సేవల కల్పనకు, డిమాండ్ తీర్చడానికి ఇది ఉపయోగపడుతుంది.

## పాక్ దాడులకు దెబ్బతిన్న సరిహద్దు ప్రాంత ప్రజలను ఆదుకోండి : రాహుల్ గాంధీ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఇటీవల పూంచ్ సెక్టర్ లో పాకిస్తాన్ దాడులకు బలైన వారి కుటుంబాలను రాహుల్ గాంధీ పరామర్శించారు. అనంతరం అయన తాను చూసిన నష్టాన్ని వివరిస్తూ, పాక్ దాడులలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల వేదనను అర్థం చేసుకోవాలని ప్రధాన మంత్రిని కోరుతూ లేఖ రాశారు.

ప్రియమైన ప్రధానమంత్రి నేను ఇటీవల పూంచ్‌ను సందర్శించాను, అక్కడ పాకిస్తాన్ కాల్పుల్లో 4 మంది పిల్లలు సహా 14 మంది విషాదకరంగా మరణించారు మరియు డజన్ల కొద్దీ గాయపడ్డారు.

ఈ ఆకస్మిక మరియు విచక్షణారహిత దాడి సాధారణ ప్రాంతాలలో భారీ విధ్వంసం సృష్టించింది. వందలాది ఇళ్ళు, దుకాణాలు, పాఠశాలలు మరియు మతపరమైన ప్రదేశాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. చాలా మంది బాధితులు తమ సంవత్సరాల కష్టార్జితం ఒక్క దెబ్బతో నాశనమైందని చెప్పారు.

పూంచ్ మరియు ఇతర సరిహద్దు ప్రాంతాల ప్రజలు దశాబ్దాలుగా శాంతి మరియు సోదరభావంతో జీవిస్తున్నారని, నేడు వారు ఈ లోతైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, వారి బాధను అర్థం చేసుకోవాలని మరియు వారి జీవితాలను పునర్నిర్మించడానికి సాధ్యమైన అన్ని సహాయం అందించాలని అది ప్రభుత్వ కర్తవ్యమని అయన లేఖలో పేర్కొన్నారు.

పాకిస్తాన్ కాల్పుల వల్ల దెబ్బతిన్న పూంచ్ మరియు అన్ని ఇతర ప్రాంతాలకు సుస్థిరమైన మరియు ఉదారమైన ఉపశమనాన్ని మరియు పునరావాస ప్యాకేజీని తీసుకురావాలని అయన భారత ప్రభుత్వాన్ని కోరారు.

## రత్నగిరికి పోటెత్తిన భక్తులు



**అన్నవరం, (విశాఖ సమాచారమ్):-** రత్నగిరికి భక్తులు వేలాదిగా పోటెత్తారు. పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగడంతో నవదంపతులు, వారి బంధుమిత్రులకు ఇతర భక్తులు తోడవడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సాయంత్రం 4 గంటల వరకూ రద్దీ కొనసాగింది. సత్యదేవుని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వ్రతాలు 2,100 జరిగాయి. ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులు నిజరూపంలో దర్శనమిచ్చారు. రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఉదయం 9 గంటలకు చండీహోమం నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న భక్తులు రూ.750 టికెట్టుతో హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

# భారతదేశ కార్మిక వర్గ కష్టాలు తీర్చేది సిఐటియు జెండానే



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** భారతదేశంలో ఉన్న అన్ని వర్గాల కార్మికుల సమస్యలు పై పోరాటం చేసి వారి కష్టాలు తీర్చేది సిఐటియు జెండానే అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు అన్నారులి ,

శుక్రవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం అరుకు వ్యాలీ మండలం పద్మపురం గార్డెన్ వద్ద జెండా ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు 1970లో ఆవిర్భవించిందని నాటి నుంచి నేటి వరకు అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తూ, కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా ఉంటూ పదుల సంఖ్యలో కార్మిక చట్టాలు సాధించుకుని కార్మికులకు రక్షణ కవచంగా సిఐటియు నిలిచిందని అన్నారు, భారతదేశ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికుల కనీస వేతనం కోసం, కార్మిక హక్కుల కోసం, వారి రక్షణ కోసం, నిత్యం కార్మికులతో మమేకమవుతూ, ఐక్యం చేస్తూ, పోరాటాలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు, మే నెల అంటేనే కార్మికుల నెలగా కార్మికులంతా గుర్తుపెట్టుకోవాలని మే మొదటి తారీకు ఎర్రజెండా పుడితే భారతదేశంలో మే 30 తేదీన సిఐటియు ఆవిర్భవించింది అన్నారు, కార్మికులలో కుల, మత ప్రాంత భేదాలు లేకుండా దేశ సమైక్యత నింపుతూ, కార్మిక వర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా, కార్మిక వర్గ కష్టాల విముక్తి ధ్యేయంగా సిఐటియు పోరాటాలు చేస్తుందని ఆయన కొనియాడారు, దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 లేబర్ చట్టాలు రద్దు చేసి , నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని ఇవి కార్మికులకు ఉరితాడుగా మారినాయని వాపోయారు, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, 44 లేబర్ చట్టాల అమలుకై జులై 9వ తేదీ దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, అనంతరం కార్మికులందరికీ సిఐటియు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపినారు, లిఈ కార్యక్రమంలో ఐ టి డి ఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడి రాజు ఆటో కార్మిక సంఘం నాయకులు రమేష్, పద్మాపురం గార్డెన్ వర్కర్స్ నాయకులు శ్రీరామ్, జగ్గారావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి సమాచారం

## ముగిసిన ప్రధానోపాధ్యాయుల బదిలీలు



**కాకినాడ :** ఉమ్మడి జిల్లా పరిధిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సందడి కొనసాగుతోంది. అందులో భాగంగా ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. కాకినాడలోని సాలిపేట నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 245 మంది బదిలీలు కోరుకోగా అర్హులకు మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్ఎంలుగా పదోన్నతులు కల్పిస్తున్నారు. ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో పి.రమేష్ పర్యవేక్షించారు. తొలుత ప్రభుత్వ, నగరపాలక, పురపాలక పాఠశాలల ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేశారు. తదుపరి జడ్పీ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. 110 మంది జడ్పీ పాఠశాలలు, 16 ప్రభుత్వ పాఠశాలల నగరపాలక సంస్థలు (రాజమహేంద్రవరం, కాకినాడ), 4 పురపాలక పాఠశాలల నుంచి 6 చొప్పున స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. ఆ తర్వాత ఎస్జీటీల నుంచి 252 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం ఇవ్వనున్నారు.

8,839 దరఖాస్తులు..

ఉమ్మడి జిల్లా పరిధిలో అన్ని కేటగిరీలకు సంబంధించి 8,839 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో తప్పని బదిలీలు 4,352, రిక్వెస్టులు 4,487 ఉన్నాయి. ప్రధానోపాధ్యాయలకు సంబంధించి 245 దరఖాస్తులు వచ్చాయి.

స్కూల్ అసిస్టెంట్, సంబంధిత సబ్జెక్టులకు సంబంధించి 4,585 దరఖాస్తులు రాగా ఈనెల 31న తుది జాబితా విడుదల అవుతుంది. జూన్ 1, 2 తేదీల్లో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలి.

ఎస్జీటీలకు సంబంధించి 4,009 దరఖాస్తులు రాగా తుది జాబితా జూన్ 6న వస్తుంది. జూన్ 7 నుంచి 10వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు.

## నిద్రమత్తులో ప్రమాదం.. మిగిల్చింది విషాదం



గండేపల్లి,: పొట్టకూటి కోసం కుటుంబాన్ని, గ్రామాన్ని వదిలి దూరప్రాంత పనులకు వెళ్లి, స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎన్‌హెచ్‌పై లారీ రూపంలో అతనికి మృత్యువు కబళించింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన చంద్రశేఖర్ ప్రధాన్(27), త్రిలోచన్ ప్రధాన్‌లు నెల కిందట మహారాష్ట్ర పనులకు వెళ్లారు. కుటుంబసభ్యులను చూసి వద్దామని యజమాని కారు తీసుకుని ఇద్దరూ బయల్దేరారు. బుధవారం రాత్రి పన్నెండు గంటల సమయానికి గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శుభమస్తు కల్యాణ మండపం ఎదురుగా ఎన్‌హెచ్‌లో పక్కకు ఆగిఉన్న లారీ (కంటైనర్‌ను)ను కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ ప్రధాన్‌కు బలమైన గాయాలయ్యాయి. అతన్ని జగ్గంపేట సీహెచ్‌సీకి, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని ఎస్సై శివనాగబాబు తెలిపారు.

**ఆగివున్న లారీని ఢీకొని..**

మహారాష్ట్ర నుంచి ఒడిశాకు కారులో బయలుదేరిన చంద్రశేఖర్ ప్రధాన్(27) రాజానగరం వరకు డ్రైవింగ్ చేశాడు. నిద్ర రావడంతో కారును త్రిలోచన్ ప్రధాన్‌కు ఇచ్చి ఎడమ వైపు కూర్చున్నాడు. ప్రయాణంలో నీలాద్రిరావుపేట వద్ద ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టడంతో డ్రైవింగ్ సీటులో ఉన్న త్రిలోచన్‌కు స్వల్పగాయాలవ్వగా, చంద్రశేఖర్‌కు బలమైన గాయాలయ్యాయి. కారు పూర్తిగా ధ్వంసమైంది. మృతుడి తండ్రి గతంలో చనిపోయారని, తల్లి, తమ్ముడు ఉన్నట్లు తెలిపారు. సోదరుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు.

## సినిమా థియేటర్లలో విస్తృత తనిఖీలు

### ఏలూరులో శీతలపానీయం ధర పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషగిరి

ఏలూరు సినిమా థియేటర్లలో నిర్వహణ లోపాలు, నిబంధనల ఉల్లంఘన, అధిక ధరలకు తినుబండారాలు, శీతలపానీయాల విక్రయాలు తదితర ఫిర్యాదుల నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏలూరు నగరం, కైకలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు పట్టణాల్లోని థియేటర్లలో ప్రతిదీ క్షుణ్నంగా పరిశీలించారు. జిల్లా కేంద్రం ఏలూరులో రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు. అంబికా కాంప్లెక్స్‌లో ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, సాయిబాలాజీ కాంప్లెక్స్, విజయలక్ష్మి వీమ్యాక్స్, సత్యనారాయణ థియేటర్లను ఏలూరు నగర తహసీల్దార్ జీవీ శేషగిరి, ఆర్.నాయక్, సిబ్బందితో ఏకకాలంలో తనిఖీ చేశారు. థియేటర్ లైసెన్సులు, అగ్నిమాపక ఎన్‌వోసీలు, పొగ గుర్తింపు (స్మోక్ డిటెక్షన్) వ్యవస్థ, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ తీరు, తాగునీటి సౌకర్యాలు, సినిమా టిక్కెట్లు, శీతలపానీయాలు తదితరాల ధరలను పరిశీలించారు. తహసీల్దార్ శేషగిరి మాట్లాడుతూ.. నగరంలోని అయిదు థియేటర్లలో 15 స్క్రీన్లలో సినిమాలు ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని థియేటర్లలో తనిఖీ చేశామన్నారు. కొన్నిచోట్ల మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని, ఓ థియేటర్‌లో తినుబండారాలు, శీతలపానీయాలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. లోపాలపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. ఇకపై అన్ని థియేటర్లలోనూ తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

2nd pages1.qxd 5/30/2025 8:41 PM Page 7



## జనన రికార్డులను పరిశీలించిన జిల్లా గణాంకాధికారి



**చోడవరం, (విశాఖ సమాచారమ్):-** స్థానిక చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు గల జనన మరణాల విభాగం ను జిల్లా గణాంకాధికారి ఏ. రామచంద్ర రావు శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా 2022-2025 (30-5-2025) వరకు గల జనన రికార్డ్స్ మరియు రిపోర్ట్స్ లను చూడటం జరిగినది.ఈ సందర్భం గా జనన మరణాల పోర్టల్ లో నమోదు, ఆసుపత్రి నందు పుట్టిన పిల్లల బర్త్ సర్టిఫికెట్స్ జారీ కార్యక్రమం చూసి సంతృప్తి చెందటం ఐంది. రికార్డ్స్ భద్రపర్చుకోవడానికి తగు సూచనలు సిబ్బందికి తెలియచేసారు.

## రేషన్ డిపో దగ్గర బియ్యం పంపిణీకి నాయకులు హాజరు కావాలి



**నాతవరం, (విశాఖ సమాచారమ్):-** వచ్చే నెల ఒకటవ తారీఖు అనగా ఆదివారం మన సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ప్రకారం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్,స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో మన నాతవరం మండలంలో ప్రతీ (పంచాయతీ)గ్రామంలో రేషన్ డిపో దగ్గర బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుంది.రేషన్ డిపో దగ్గర బియ్యం ప్రతి కార్డు దారుకు పంపిణీ అవుతుందో లేదో ఆ పంచాయతీలో కూటమి నాయకులు అందరూ తప్పనిసరిగా పాల్గొనవలిసిందిగా మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ తెలిపారు.

## అరుదైన ఘనత సాధించిన వీర రాఘవరావు

**వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో వీర రాఘవరావుకు చోటు**

**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** అనపర్తి మండలం కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు నక్కిన వీర రాఘవరావు వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం దక్కింది.అనపర్తి మండలం కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు నక్కిన వీరరాఘవరావు కి ధ్రువీకరణ పత్రాన్ని, గోల్డ్ మెడల్, మెమెంటో,గోల్డ్ పెన్ ను అందించి

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వీర రాఘవరావు మాట్లాడుతూ

ప్రముఖ వ్యక్తుల జీవితాలను, ముఖ్య సంఘటనలు, పర్వదినాల ప్రాముఖ్యత ను తెలియ పాటలు వ్రాసి, వాటికి స్వరం సమకూర్చి స్వయంగా వీడియో ఎడిటింగ్ చేసి, అతి తక్కువ కాలంలో అందించినందుకు, తెలుగు సాహిత్య రంగంలో నిర్విరామంగా కృషి చేస్తున్నందుకు ఒకేసారి మూడు రికార్డులు తన సొంతమయ్యాయి అని అన్నారు.అరుదైన ఘనతను రాఘవరావు సొంతం చేసుకోవడం చాలా గొప్ప విషయంగా పేర్కొన్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకట సుబ్బారెడ్డి,కుతుకులూరు గ్రామ సర్పంచ్ శ్రీమతి జి. హేమతులసి, ఎస్. శ్రీనివాస్, పి. తిరుమలరెడ్డి, కె. రామారెడ్డి, యన్. తాతారెడ్డి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని అభినందించారు.


## యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎమ్. శాంతి ప్రభ**



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందని ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం శాంతి ప్రభ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనకాపల్లి పట్టణం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు జిల్లాలోని వివిధ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారుల తో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి యోగా గురువుల పర్యవేక్షణలో యోగాసనలు వెయ్యడం జరిగింది.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం శాంతి ప్రభ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య ఆధ్వర్యంలో యోగ పై అవగాహన ర్యాలీని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ఎన్. టి. ఆర్, జిల్లా కేంద్ర ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించి యోగాంధ్ర పై ప్రజలను చైతన్య పరచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య, జిల్లా లెప్రసీ అధికారి బాలాజీ నర్సీపట్నం ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె. విరజ్యోతి, జాతీయ ఆర్యో యషన్ జిల్లా అధికారివు డా. ప్రశాంతి, జిల్లా వ్యాధినిరోధక టికాల అధికారి డా. చంద్ర శేఖర్ దేవ్, ఆర్ ఎం ఓ గౌతమ్ అనకాపల్లి ఎన్.టి.ఆర్. వైద్యశాల సూపరింటెండెంటే డాక్టర్ కృష్ణ రావు, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది మరియు జిల్లాలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల లో పని చేయు చున్న వైద్యాధికారులు పాల్గొన్నారు.

# రంగరించిన ప్రణాళిక.. ఇక ఉజ్వల విశాఖ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా విశాఖకు నీతిఆయోగ్ ఆర్థిక ప్రణాళికలను రూపొందిస్తోంది. ఈ కసరత్తు దాదాపు చివరి దశకు చేరింది. రంగాల వారీగా వృద్ధిపై అంచనాలు తయారు చేశారు. అందుకు పెట్టుబడుల అవకాశాలపైనా నిపుణులతో కూలంకషంగా చర్చించారు. పలుమార్లు విశాఖను సందర్శించి అభివృద్ధికి వీలున్న రంగాల ద్వారా ఆదాయాన్ని ఎలా సృష్టించాలో సూచనలు చేశారు. ముసాయిదా నివేదిక దాదాపు సిద్ధమవ్వగా త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో తుది నివేదిక ఖరారు చేయనున్నారు.

పెట్టుబడులు ఆకర్షించేలా..: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ పెట్టుబడులతో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా కొన్ని ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు పెట్టుబడులతో కొత్త వాటికి ఆలోచన చేశారు. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో ఉక్కు కర్మాగారం, గ్రీన్‌హైడ్రోజన్ హబ్‌లకు అడుగులు పడ్డాయి. విశాఖ పోర్టు ఆధారంగా కొన్ని సెక్టార్లను అభివృద్ధి చేయనున్నారు. అలాగే ఫుడ్ ప్రాసెస్, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు మరికొన్ని నెలకొల్పాలనే ప్రణాళికలున్నాయి.

ఆ నాలుగులో: దేశంలో మొత్తం 20 నగరాలకు ఆర్థిక ప్రణాళికలు రూపొందించాలని కేంద్రం నిర్ణయించింది. మొదట ప్రయోగాత్మకంగా ముంబయి, సూరత్, వారణాశి, విశాఖలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. ప్రణాళికల రూపకల్పనపై విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సమన్వయంతో ముందుకువెళ్తున్నారు. గత ఆరు నెలల్లో ఐదారుసార్లు సమావేశమైన నీతిఆయోగ్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలోనూ పర్యటించింది. విశాఖ కేంద్రంగా అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

## యువ అథ్లెట్లను ప్రోత్సహించడానికి డాబర్ గ్లూకోజ్ 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారం ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** హౌస్ ఆఫ్ డాబర్ నుండి ప్రముఖ ఇన్‌స్టంట్ ఎనర్జీ డ్రింక్ అయిన డాబర్ గ్లూకోజ్, యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికి మరియు భారతదేశం అంతటా ఉన్న ప్రధాన క్రీడా అకాడమీలలోని యువ అథ్లెట్లలో శక్తి మరియు స్టామినా యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి 'ఎనర్జైజ్ ఇండియా' అనే మెగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది.

ఈ ప్రచారంలో భాగంగా, డాబర్ గ్లూకోజ్ విశాఖపట్నంలోని సాయి అకాడమీలో శక్తి మరియు స్టామినా నిర్వహణపై ప్రత్యేక అవగాహన సెషన్‌ను నిర్వహించింది, ఇందులో ప్రఖ్యాత వైద్యుడు, సెంటర్ ఇన్‌ఛార్జ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణా కేంద్రం పోర్ట్ స్టేడియం, డాబర్ ఇండియా నుండి శ్రీ సత్యనారాయణ, దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సెషన్ అథ్లెట్లు తమ పనితీరును ఆప్టిమైజ్ చేయడానికి మరియు వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడంలో సహాయపడటానికి విలువైన అంతర్దృష్టులు మరియు వ్యూహాలను అందించింది. డాబర్ అగ్రశ్రేణి అథ్లెట్లు విజయ లక్ష్మి, ప్రవళిక, బి. అభిరామ్, ఈశ్వర్ గోపిలను కూడా సత్కరించింది.

"యువ అథ్లెట్లలో శక్తి మరియు సత్తువ యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి మరియు వారి సంబంధిత క్రీడలలో రాణించడానికి అవసరమైన శక్తిని అందించడానికి మా 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారాన్ని ప్రారంభించడం మాకు సంతోషంగా ఉంది. ఒక బ్రాండ్‌గా, డాబర్ గ్లూకోజ్ అథ్లెట్లు, క్రీడా ఔత్సాహికులు మరియు చురుకైన జీవనశైలిని నడిపించే వ్యక్తులకు సరిగ్గా సరిపోతుంది. శారీరక కార్యకలాపాలలో నిమగ్నమైన వ్యక్తులకు అవసరమైన తక్షణ శక్తిని అందించడానికి ఈ ఉత్పత్తి రూపొందించబడింది," అని డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్-హెల్త్ సప్లిమెంట్స్ శ్రీ అమిత్ గార్గ్ అన్నారు.

శ్రీ సత్యనారాయణ్ నిర్వహించిన ఎనర్జీ సెషన్‌లు, సరైన పనితీరును నిర్ధారించడానికి సరైన పోషకాహారం మరియు హైడ్రేషన్ యొక్క ప్రాముఖ్యత గురించి యువ అథ్లెట్లకు అవగాహన కల్పించడంపై దృష్టి సారించాయి. ఈ సెషన్‌లో ఏ అథ్లెట్‌కైనా కీలకమైన స్టామినా మరియు ఓర్పును మెరుగుపరచడానికి చిట్కాలు మరియు పద్ధతులు కూడా ఉన్నాయి.

# ఎండియు వ్యవస్థను కొనసాగించాలి

**- గిరిజన ప్రాంతం లోలిప్రజలకు ఉపయోగపడే వ్యవస్థను తొలగించరాదు**
**- జిల్లా వైస్సార్ యూత్ అధ్యక్షులు గబ్బాడి శేఖర్**



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు ఎంతో సౌలభ్యంగా ఉన్న ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థ , ఎండియు ఆపరేటర్ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేయకుండా కొనసాగించాలని అల్లూరి జిల్లా వైఎస్ఆర్ సిపి యూత్ అధ్యక్షులు గబ్బాడి శేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు నేరుగా రేషన్ సరుకులు అందించడం కొరకు అప్పటి వైసిపి ప్రభుత్వం 9,260 మంది ఎండియు ఆపరేటర్లను నియమించిందని వారికి హెల్పర్లుగా మరో 9,260 మంది హెల్పర్లు ఉన్నారని ఇప్పుడు ఈ వ్యవస్థను రద్దు చేస్తే వీరందరూ జీవనోపాధిని కోల్పోయిన వారు అవుతారని అన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో రేషన్ దుకాణానికి వెళ్లాలంటే సుమారు 5 నుండి 10 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి ఉంటుందని దీనివలన సుదూర ప్రాంతాలలో గల గిరిజనులు అనేక ఇబ్బందులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుతుందని, అదే ఎండియు వ్యవస్థ ఉంటే నేరుగా బియ్యం తీసుకొని వచ్చి ఇచ్చేవారని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మరియు ఎం డి యు ఆపరేటర్ల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని ఈ వ్యవస్థను కొనసాగించాలని గబ్బాడి శేఖర్ డిమాండ్ చేసారు.ముఖ్యం గా ఎం డి యు వ్యవస్థ పెట్టడం వలన గ్రామాల్లోకి బియ్యం నిత్యవసర సరుకులు పట్టుకొని వెళ్లి ఇంటి వద్ద అందజేయడం వలనగిరిజన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని ఇప్పుడు డిపోలకి వెళ్లి తెచ్చుకోవడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని ఆయన అన్నారు. మైళ్ళు దూరం నడుచుకొని వెళ్లి నిత్యవసర వస్తువులు తెచ్చుకోవలసిన దుస్థితి ఏర్పడుతుందని వెళ్లిన రోజు డిపో ఖాళీగా ఉంటుందో లేదో గంటలు రోజులు తరబడి నిరీక్షణ చేయవలసి ఉంటుందని ఇది దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఎండియు వ్యవస్థను కొనసాగించి ఇంటికి వద్దే నిత్యవసర సరుకులు అందించేలా ఆయన డిమాండ్ చేశారు.

# జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంకు 16 వినతులు

**జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు**



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కి సంబంధించి 16 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరం లో సిపిలు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న %ూ+=ూ% కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చీఫ్ సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి జివిఎంసి కి సంబంధించి 16 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 01, 3వ జోన్ కు 01, 4వ జోన్ కు 02, 5వ జోన్ కు 09, 7వ జోన్ కు 02 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

# అత్తపై కత్తితో అల్లుడి దాడి - చికిత్స పొందుతూ మృతి

**ఉంద్రాజవరం, :** కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తపై అల్లుడు కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన ఉంద్రాజవరం మండలంలోని దమ్మెన్నులో గురువారం చోటుచేసుకుంది. ఏఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. దమ్మెన్ను గ్రామానికి చెందిన కోదాటి శ్రీదేవి(60) తన పెద్ద కుమార్తె శిరీషను తాడేపల్లిగూడెంనకు చెందిన బేట ధనరాజు అలియాస్ నాగేంద్రకు ఇచ్చి 2020లో వివాహం చేశారు. ధనరాజు చెడు వ్యసనాలకు అలవాటు పడి భార్యను తరచూ వేధించేవాడు. దీంతోపాటు ఆమె నగలను అమ్మి ఖర్చు చేసేశాడు. విసుగు చెందిన ఆమె తల్లి ఇంటికి వచ్చేసింది. గురువారం ధనరాజు దమ్మెన్ను రాగా గొడవ నెలకొంది. దీంతో అతను శ్రీదేవిని కూరగాయల కత్తితో పొడిచి తీవ్రంగా గాయపర్చాడు. ఆమెను తణుకు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శ్రీదేవి చిన్న కుమార్తె లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కేజీహెచ్‌లో కోవిడ్ వార్డు

**సిద్ధం చేసిన పడకలు**



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** కొవిడ్ కేసులు నమోదవుతున్న వేళ కేజీహెచ్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. 50 పడకలతో ఐసోలేషన్ వార్డు సిద్ధం చేశారు. ఆయా పడకలకు ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేశారు. వ్యాధి లక్షణాలతో బాధపడే వారికి వైరాలజీ ల్యాబ్‌లో కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలోని ఇతర ఆసుపత్రులు, ప్రైవేటు ల్యాబ్‌ల నుంచి తీసుకొస్తున్న నమూనాలను ఇక్కడ పరీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఒకటి, రెండు కేసులు నమోదు అవుతున్నా ప్రమాదమేమీ లేదని పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద తెలిపారు. 75 ఏళ్లు పైబడి, చక్కెరవ్యాధి, హృద్రోగం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడే వారిలో కొవిడ్ లక్షణాలు కనిపిస్తున్నా... ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీ నగరంలో ఓ వృద్ధుడు కొవిడ్‌తో చనిపోయినట్లు గురువారం ప్రచారం సాగింది. అయితే అది వాస్తవం కాదని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

## శ్రమదానంతో రామాలయం నిర్మిస్తున్న అంజలి శనివారం గ్రామస్తులు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లో అంజలి శనివారం పంచాయతీ భూసుల కోట గ్రామంలో ని ప్రజలు కలిసి శ్రమదానం తో శ్రీ సీతారాముల ఆలయం నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికై సగానికి పైగా ఆలయం నిర్మాణం పనులు అయ్యాయని త్వరలో ఆలయం నిర్మాణం పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని గ్రామస్తులు ఆలయ కమిటీ తెలిపింది. ఎవరైనా దాతలు ఇసుక సిమెంటు ఇటుకలు వంటివి ఇవ్వడానికి వచ్చి సహకరించాలని బూసర్ల కోట శ్రీరామ భక్త బృందం కోరింది. విరాళాలు ఇచ్చే దాతలు 9441279519. 7670884647. ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆలయ కమిటీ కోరింది.

## మే 31 న వీరవనిత అహల్యాబాయి హెూల్కర్ త్రిశత జయంతి



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** మే 31వ తేదీన రాజమండ్రిలో వీరవనిత అహల్యా భాయి హెూల్కర్ త్రిశత జయంతి వేడుకలు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నాముఅని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. నల్లమిల్లి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ. రాజమహేంద్రవరం మంజీరా హెూటల్లో జరిగే ఈ కార్యక్రమానికి చత్తీస్ ఘడ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ అరుణ్ సాహెూముఖ్యఅతిథిగా హాజరు కానున్నారుఅని తెలిపారు.

వై జంక్షన్ నుండి మంజీరా హెూటల్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి మంజీరా హెూటల్లో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు.

మహానుభావురాలు, సుపరిపాలన అందించిన వ్యక్తి, దేవాలయాలు నిర్మించిన వ్యక్తి చరిత్రను ప్రజలందరూ తెలుసు కోవడం కోసం ఈకార్యక్రమాన్నినిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న బిజెపి శ్రేణులన్నీ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆ మహానుభావురాలు అని అందరూ నివాళులుఅర్పించాలి అని కోరారు.

## చరిత్రలో ఈ రోజు (మే 31)

**సంఘటనలు:**

1970: ప్రపంచ కప్ ఫుట్‌బాల్ పోటీలు మెక్సికోలో ప్రారంభమయ్యాయి.

2002: దక్షిణ కొరియా, జపాన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ కప్ సాకర్ పోటీలు ప్రారంభమయ్యాయి.

**జననాలు:**

1843: ఎన్‌రిక్వెటా ఆగస్టినా రైలాండ్స్, బ్రిటిష్ దాత

1911: మారిస్ అల్లెస్, ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత

1942: ఘట్టమనేని కృష్ణ, సినిమా నటుడు, నిర్మాత, పార్లమెంటు సభ్యుడు.

1984: దేవి గ్రంథం ,తెలుగు చలన చిత్ర నటి, నిర్మాత, రాజకీయ నాయకురాలు.

1993: శోభిత ధూళిపాళ్ల, తెలుగు చలన చిత్ర నటి. మోడల్.

**మరణాలు:**

1964: దువ్వూరి సుబ్బమ్మ, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన మొట్టమెదటి ఆంధ్ర మహిళ. సమాజసేవిక, స్త్రీ జనోద్ధరణకు కృషి చేసిన మహిళ

1985: సముద్రాల రామానుజాచార్య, సముద్రాల జూనియర్ గా పేరొందిన తెలుగు సినిమా రచయిత

2022: కెకె గా పరిచితుడైన కృష్ణకుమార్ కున్నత్, భారతీయ గాయకుడు.

**దినోత్సవం:**

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

2nd pages1.qxd 5/30/2025 8:41 PM Page 8



# క్రీడా సమాచారమ్

## ఐపీఎల్ ఫైనల్‌లో విరాట్ కోహ్లీ కీలక ఇన్నింగ్స్ ఆడతాడు

### ఏబీ డివిలియర్స్ జోస్యం



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా.. పంజాబ్ కింగ్స్ , రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ల మధ్య గురువారం క్వాలిఫయర్-1 మ్యాచ్ జరిగింది. ఏకపక్షంగా సాగిన ఈ లో స్కోరింగ్ గేమ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో బెంగళూరు విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లిన మొదటి జట్టుగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 14.1 ఓవర్లలో కేవలం 101 పరుగులకే ఆలౌటైంది. తర్వాత ఛేదన ప్రారంభించిన ఆర్సీబీ 10 ఓవర్లకు 2 వికెట్లు నష్టపోయి 106 పరుగులు చేసింది. కానీ ఈ మ్యాచ్‌లో కోహ్లీ తన బ్యాట్‌తో (12) విఫలమయ్యాడు. ఇది అభిమానులను కాస్త నిరాశపరిచింది. అయితే ఆర్సీబీ మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ మాత్రం విరాట్‌కు మద్దతుగా నిలిచాడు. ఫైనల్స్‌లో ఈ ఛేజ్ మాస్టర్ తప్పకుండా కీలక ఇన్నింగ్స్ ఆడతాడని జోస్యం చెప్పాడు. అలాగే ఆర్సీబీ తప్పకుండా ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశాడు.

'విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్‌లో పెద్దగా పరుగులు చేయలేకపోయాడు. అయినా ఇబ్బందేమీ లేదు. అతడు కచ్చితంగా ఫైనల్ మ్యాచ్‌లో కీలకమైన ఇన్నింగ్స్ ఆడతాడు. ఈ విషయంలో నాకు ఎటువంటి అనుమానమూ లేదు. అతడు ఆడుతుంటే చూడ్డానికి నేనెంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని ఏబీ డివిలియర్స్ అన్నాడు. అలాగే ఆర్సీబీ జట్టు గురించి కూడా అతడు తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'నాకు తెలిసి 2011లో ఐపీఎల్ టైటిల్ గెలిచేందుకు అద్భుతమైన అవకాశం ఉండేది. అలాగే అందరూ 2016 సీజన్ గురించి కూడా మాట్లాడుతున్నారు. కానీ గతాన్ని మరిచిపోవాలి. ప్రస్తుతం ఆర్సీబీ ఎక్కడ ఉంది. 2025లో ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు చాలా చేరువలో ఉంది. జూన్ 3న జరగనున్న తుదిపోరులో ఆర్సీబీ తప్పకుండా విజయం సాధిస్తుంది. ప్రపంచస్థాయి ఆటగాడైన జోష్ హేజిల్‌వుడ్ రాకతో ఆర్సీబీ బౌలింగ్ యూనిట్ బలంగా మారింది. అతడు మాకు కీలకమైన ఆటగాడు. అలాగే భువనేశ్వర్ కుమార్ కూడా చక్కగా బౌలింగ్ చేస్తున్నాడు' అని డివిలియర్స్ విశ్లేషించాడు.

## విరాట్ కోహ్లీ స్లెడ్జింగ్.. సోషల్ మీడియాలో వ్యతిరేకత



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా గురువారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , పంజాబ్ కింగ్స్ మధ్య క్వాలిఫయర్ – 1 మ్యాచ్ జరిగింది. ఈ పోరులో ఆర్సీబీ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కానీ ఈ మ్యాచ్‌లో కోహ్లీ చేసిన ఓ పని క్రీడాభిమానులకు సైతం కోపం తెప్పించింది. దీంతో సోషల్ మీడియాలో వారు తమ వ్యతిరేకతను చూపించారు.

పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా సర్ఫరాజ్ ఖాన్ సోదరుడైన ముషీర్ ఖాన్ క్రీజులోకి వచ్చాడు. ఇదే అతడికి తొలి ఐపీఎల్ మ్యాచ్. ఆ సమయంలో స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కోహ్లీ.. ముషీర్ ఖాన్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. 'యేతో పానీ పిలాతా హై' (ఇతడు నీళ్లు అందిస్తాడు) అంటూ స్లెడ్జింగ్ చేశాడు. ముషీర్ ఖాన్ కొన్ని ఓవర్లకు ముందే మైదానంలోని తమ జట్టు ఆటగాళ్లకు నీళ్ల సీసాలు అందించాడు. పంజాబ్ కింగ్స్ మిడిల్ ఆర్డర్ విఫలమవడంతో తర్వాత ముషీర్ ఖాన్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు క్రీజులోకి వచ్చాడు. ఈ నేపథ్యంలో నీళ్లు అందించే వ్యక్తి ఇప్పుడు ఆడటానికి వచ్చాడు అని కోహ్లీ.. ముషీర్ ఖాన్‌ను చులకన చేసి మాట్లాడాడు. ఒక స్టార్ బ్యాటరై ఉండి.. కోహ్లీ ఓ యువ ఆటగాణ్ని ఇలా అనడం పలువురు అభిమానులకు నచ్చలేదు. దీంతో తమ వ్యతిరేకతను సోషల్ మీడియాలో వ్యక్తం చేశారు. కోహ్లీ స్థాయికి ఈ చర్య తగదని, యువ ఆటగాళ్లను ప్రోత్సహించాల్సింది పోయి.. ఇలా స్లెడ్జింగ్ చేయడం ఏంటని ప్రశ్నించారు.

అయితే ఆర్సీబీ అభిమానులు కొందరు విరాట్ కోహ్లీని వెనకేసుకొచ్చే ప్రయత్నమూ చేశారు. ఈ సీజన్ ప్రారంభంలో విరాట్‌కోహ్లీ తన బ్యాట్‌ను ముషీర్ ఖాన్‌కు బహుమతిగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ముషీర్ ఖాన్‌కు కూడా విరాట్ కోహ్లీ ఆరాధ్య క్రికెటర్ అని గుర్తు చేశారు. కోహ్లీ ఓ అన్నలా తమ్ముడిలాంటి ముషీర్‌ఖాన్‌ను ఆటపట్టించడంలో తప్పేముందని సమర్థించారు. ముషీర్‌ఖాన్ బ్యాటింగ్‌కు వచ్చే సమయంలో పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ కుప్పకూలిన పరిస్థితిలో ఉంది. అప్పుడు క్రీజులోకి వచ్చిన ముషీర్ ఖాన్ పంజాబ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేయకుండా ఉండేందుకు అతడి మనసును మళ్లించే ప్రయత్నంలో భాగంగానే కోహ్లీ ఇలా చేసి ఉంటాడని పలువురు క్రీడావిశ్లేషకులు తమ అభిప్రాయం వ్యక్తంచేశారు.

## సంగీతంలో నాలాంటి వాళ్లు అరుదు : ఇళయరాజా



"ఏ సంగీతకారుడినైనా తీసుకోండి. వాళ్లు తప్పనిసరిగా సంగీతం నేర్చుకుని ఉంటారు, లేదంటే ఎవరిదగ్గరైనా శిష్యరికం చేసి ఉంటారు. నేను మాత్రం ఎవరి దగ్గరా సంగీతం నేర్చుకోలేదు. నాకు ఆ దేవుడే ఈ వరాన్ని ఇచ్చినట్టుగా అనిపిస్తుంది. నాలాంటివాళ్లు ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఉండరు. గతంలోనూ లేరు, భవిష్యత్తులోనూ రారు" అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా . ఆయన ఇటీవల తెలుగు చిత్రం 'షష్టిపూర్తి'కిస్వరాలు సమకూర్చారు. రూపేశ్ కథానాయకుడిగా నటిస్తూ, నిర్మించిన చిత్రమిది. రాజేంద్రప్రసాద్), అర్చన కీలక పాత్రలు పోషించారు. పవన్ ప్రభ దర్శకుడు. ఈ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇళయరాజాతో, గీత రచయిత చైతన్యప్రసాద్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ భేటీలో ఇళయరాజా పలు ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించారు.

"నేను ఎక్కడో ఓ చిన్న గ్రామంలో పుట్టాను. అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు కూడా ఉండరు. చిన్నప్పుడు మా అన్న పాటలు పాడుతుండేవారు. అలా ఆ పాటలు వింటూ నేను ఏదో ఒకటి వాయిస్తూ ఉండేవాడిని. అలాంటి చోటు నుంచి ఈ స్థాయికి వచ్చాను. అసలు నాకు సంగీతం ఎలా వచ్చింది? నా నుంచి పాటలు ఎలా ఉద్భవిస్తాయో కూడా నాకు తెలియదు. మా అన్న పాడిన పాటలకు నేను సంగీతం వాయిస్తే, అప్పుడు అందరూ చప్పట్లు కొడుతుండేవారు. ఆ చప్పట్లు వింటే నాకు గర్వం పెరుగుతూ వచ్చేది. అయితే వాళ్లు చప్పట్లు కొట్టేది నేను వాయించినందుకా లేక, ఆ సంగీతానికా? అనే ప్రశ్న మొదలైంది. సంగీతానికి కొడుతున్నారని తెలిశాక, నేనూ అలా సంగీతం కంపోజ్ చేయాలని దానిపై దృష్టిపెట్టా. అలా సంగీత దర్శకుడినయ్యా" అన్నారు ఇళయరాజా.

ఏఐ సాంకేతికత గురించి ఆయన మాట్లాడుతూ "ట్రెండ్ అనే మాట నాకు అర్థం కాదు. పాట బాగుంటే ఎప్పుడైనా వింటారు. అందులో ట్రెండ్ అనేది ఏదీ ఉండదు. ఏఐ (కృత్రిమమేధ) అనేది స్వతహాగా ఏమీ చేయలేదు. మనిషి మెదడు లక్ష ఏఐలతో సమానం. మనిషి ఏఐని కనిపెట్టాడు కానీ, ఏఐ మనిషిని కానీ, మానవ మెదడునికానీ సృష్టించలేదు" అన్నారు. కొత్తగా వస్తున్న తరాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే 'షష్టిపూర్తి' చేశానని చెప్పారు ఇళయరాజా. "మంచి కథ ఉందా లేదా? అనేదే చూస్తాను. స్టార్స్ ఉన్నారా? లేదా అనేది ఎప్పుడూ పట్టించుకోను. నా కెరీర్ ఆరంభం నుంచీ కొత్తవాళ్లని ప్రోత్సహిస్తూ వస్తున్నా. భారతీరాజా, మణిరత్నం... ఇలా అందరూ అప్పట్లో కొత్తవాళ్లే. నాతో సినిమాలు చేశాక వారికి ఆ స్టార్‌డమ్, గుర్తింపు వచ్చింది" అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మాత ఎ.ఎం రత్నం



**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి )ని సినీ నిర్మాత ఎ.ఎం.రత్నం కలిశారు. 'హరిహర వీరమల్లు' చిత్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 17వ శతాబ్దానికి సంబంధించిన కథతో రూపొందిన 'హరిహర వీరమల్లు' గురించి ఆయన సీఎంతో చర్చించారని పేర్కొంది. అలాగే తెలంగాణలో ఈ సినిమా టికెట్ ధరల గురించి కూడా ప్రస్తావించినట్లు తెలిపింది. తన విలువైన సమయాన్ని కేటాయించినందుకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఎ.ఎం రత్నం కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ కల్యాణ్ ) కథానాయకుడిగా రాబోతున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే.

## విశ్వ సుందరి కిరీటం ఎవరికో?

● నేడే మిస్ వరల్డ్ ఫైనల్స్ ● హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలేకు రెడీ ● టాప్ 40 అందాల భామల జాబితా పూర్తి ● ఫైనల్స్‌కు న్యాయ నిర్ణేతగా సోనూ సూద్



**హైదరాబాద్, (విశాఖ సమాచారమ్):-** మిస్ వరల్డ్ పోటీలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. హైటెక్స్ వేదికగా శనివారం ఫైనల్స్ జరగనున్నాయి. దీనికోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 72వ మిస్ వరల్డ్ గ్రాండ్ ఫైనల్ హైదరాబాద్‌లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సాయంత్రం 6:30 గంటలకు జరగనుంది.

ప్రపంచవ్యాప్తంగా 108 మంది వివిధ దేశాల భామలు మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడుతున్నారు. సుమారు 20 రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాల్లో వీరంతా పాల్గొని తమ ప్రతిభను చాటటంతో పాటు, తెలంగాణలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని ప్రపంచవ్యాప్తం చేశారు. మిస్ వరల్డ్ 2016 స్టెఫానీ డెల్ వాలె, భారతీయ ప్రెజెంటర్ సచిన్ కుంభర్ హోస్ట్ లుగా వ్యవహరిస్తారు. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ ఫైనల్స్ లో స్టేజ్ పైన ల్కెవ్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

ప్రముఖ మానవతావాది, నటుడు సోనూ సూద్‌కు మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు ప్రదానం చేయనున్నారు. ఆయన ఫైనల్స్ కు న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరిస్తారు. ఇతర జ్యూరీలుగా సుధా రెడ్డి, డాక్టర్ కారినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014), మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ఉన్నారు. మిస్ వరల్డ్ 2017, బాలీవుడ్ నటి మనుషి చిల్లర్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా కనిపించనున్నారు.

ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా (71వ మిస్ వరల్డ్) కొత్త మిస్ వరల్డ్ విజేతకు కిరీటం అందజేస్తారు. నిర్వాహకులు అందాల భామలతో కలిసి ట్రైటెండ్ హోటల్, హైటెక్స్‌లో రిహార్సల్స్ చేశారు. దీనికి ముందు నిర్వహించిన మల్టీమీడియా చాలెంజ్‌లో ఒక్కో ఖండం నుంచి ఒకరు చొప్పున మొత్తం నలుగురిని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ విజేతలుగా ప్రకటించింది. అమెరికన్-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ భామ మైరాడెల్గాడోబ్, ఆఫ్రికా నుంచి కామెరూన్ సుందరి ప్రిన్సెస్సీ, యూరోప్ నుంచి మోంటెనెగ్రో భామ ఆండ్రియా నికోలిక్, ఆసియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్ సుందరి సుచాటా విజేతలుగా నిలిచారు. ఈ నలుగురు మిస్ వరల్డ్ క్వార్టర్ ఫైనల్(టాప్40) జాబితాలో చోటు దక్కించుకున్నారు. దీంతో ఫాస్ట్‌ట్రాక్‌లో ఇప్పటివరకు 16 మంది భామలకు చోటు దక్కింది. కాగా మిగతా వారిని న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారు.

హైటెక్స్‌లో జరిగే వేడుకకు 108 దేశాల అందాల భామలు హాజరవుతారు. తొలుత ఖండాల వారీగా ర్యాంప్ వాక్ చేస్తారు. వీరిలో 40 మందే తదుపరి దశకు చేరుకుంటారు. ఇప్పటికే అందులో చోటు దక్కించుకున్న 16 మంది భామలను మొదటగా పిలుస్తారు. ఆ తర్వాత న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన 24 మంది వస్తారు. మిగిలిన వారు వారికి కేటాయించిన స్థానాలకు వెళ్లిపోతారు. తరువాతి నుంచే ఫైనల్స్ ప్రారంభమవుతాయి.

**ఆ ప్రశ్నతో విజేతను నిర్ణయిస్తారు..**

టాప్ 40 నుంచి తదుపరి రౌండుకు 20 మందిని, ఆ తర్వాత వారిలో 8 మందిని ఎంపిక చేస్తారు. ఇందులో ఒక్కో ఖండం నుంచి ఇద్దరేసి ఉంటారు. మహిళల సమకాలిక సమస్యలు, ఇతర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. ఇద్దరు పోటీదారుల్లో ఎవరు ఉత్తమంగా సమాధానం ఇచ్చారనేది అక్కడ ఉండే న్యాయనిర్ణేతలు నిర్ణయిస్తారు. అలా ఎనిమిది మంది నుంచి నలుగురిని ఎంపిక చేస్తారు. ప్రపంచ సుందరి అయితే ఏం చేస్తారు? అనే ఆఖరి ప్రశ్న అడుగుతారు. వారిచ్చే సమాధానం ఆధారంగా ప్రపంచ సుందరి ఎవరనేది నిర్ణయమవుతుంది. విజేతకు 2024 మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా అందాల కిరీటాన్ని ధరింపజేయడంతో వేడుక ముగుస్తుంది.

**ల్కెవ్‌లో చూడాలంటే..**

తెలంగాణలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అద్భుతంగా జరుగుతున్నాయి. మరికొన్ని గంటల్లోనే గ్రాండ్ ఫైనల్ మొదలు కాబోతుంది. తెలంగాణలోని హైదరాబాద్‌లో హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ వేడుక గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ల్కెవ్‌లో చూసేవిధంగా ఏర్పాట్లు చేశారు. ప్రపంచ సుందరి ఎవరో తెలుసుకోవాలనే కోరిక ఉన్నవారందరూ.. ప్రపంచంలో ఎక్కడా ఉన్నా ఈ ఈవెంట్? చూసేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే ఈవెంట్?ను ఎంపిక చేసిన దేశాల్లో అక్కడి నేషనల్ టెలివిజన్ ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా చూసే వెసులుబాటు కల్పిస్తున్నారు.

శనివారం హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌ల మధ్యాహ్నం 1గంటకు ఈవెంట్ స్టార్ట్ కానుంది. టీవీలో ల్కెవ్ అందుబాటులో ఉంది కాబట్టి.. ఈవెంట్‌ను చూడాలనుకుంటే స్థానికంగా ప్రసారమయ్యే చానల్స్‌లో చూడవచ్చు.

**తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా..**

ఈ ఏడాది ఈ ఈవెంట్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చింది. తెలంగాణ సాంస్కృతిని ప్రతిబింబించేలా ఈ గ్రాండ్ ఫైనల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యూటీతో పాటు.. తెలివితేటలను కూడా కంటెస్టెంట్లు చూపించాల్సి ఉంటుంది. 'బ్యూటీ విత్ ఎ పర్పస్' అనే కాన్సెప్ట్‌తో సామాజిక అవగాహన కల్పించనున్నారు.

**ఫైనల్స్‌లో నందిని గుప్తా..**

టాప్ మోడల్ విన్నర్స్‌లో ఇండియాను రిప్రెజెంట్ చేస్తున్న నందిని గుప్తా నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా 108 మంది పోటీదారులు పాల్గొనగా.. నాలుగు కాంటినెంటల్ విన్నర్స్‌లో నందిని గుప్తా నిలిచి 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ క్వార్టర్ ఫైనల్‌లో ఫాస్ట్ ట్రాక్ స్థానాన్ని దక్కించుకుంది. ఇప్పటికే భారతీయులు ఈమె ప్రపంచ సుందరిగా గెలవాలని కోరుకుంటున్నారు. నందిని గుప్తా మిస్ వరల్డ్ కిరీటం అందుకుంటే ఇండియాను విజేతగా నిలిపిన 7 బ్యూటీగా నిలిస్తుంది. ఇప్పటివరకు రీటా ఫరియా, ఐశ్వర్య రాయ్, దయానా హెడెన్, యుక్తా ముఖి, ప్రియాంక చోప్రా, మానుషి చిల్లర్ మిస్ వరల్డ్ ట్కెటిల్‌ని సొంతం చేసుకున్నారు. 2017 తర్వాత ఇండియాకు ఈ మిస్ వరల్డ్ కిరీటం దక్కలేదు.

## అర్హులైన పేద లబ్ధిదారులందరికి కూడా టిడ్కో గృహాలను అందజేస్తాం

● టీడీపీ శ్రేణులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం.. ● అనకాపల్లి పట్టణం, స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహణ ● కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను 100 శాతం అమలుపారుస్తాం ● ప్రజల వినతులను తీసుకొని స్వయంగా అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసిన రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** అనకాపల్లి పట్టణం, స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము, జిల్లా ఉపాధ్యక్షులు బిఎస్ఎమ్కె జోగి నాయుడు, తలారి కాశీ నాయుడులతో పాల్గొని టీడీపీ శ్రేణులు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీ టిడ్కో గృహాలను అర్హులైన ప్రభుత్వానికి డిడి కట్టిన లబ్దిదారులకు కేటాయిస్తామని అన్నారు. అంతేకాకుండా విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం చేయాలనీ కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వం లో మంజూరు అయి గత ప్రభుత్వం లో దద్దు చేయబడిన అర్హులైన వారి పించనలను మళ్ళీ పునరుద్దీస్తామని అన్నారు. అంతేకాకుండా ఇండ్ల స్థలాలు, పింఛన్లు, సీసీ రోడ్లు, కాలువల కోసం వినతులు అందజేయగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యంగుల వారి సమస్యల కోసం వారికీ వినతి పత్రాన్ని అందజేయగా, సమస్యల పరిస్కారం కోసం హామీ ఇచ్చారు. అంతేకాకుండా గ్రామాలలో వీధి లైట్లు కోసం విజ్ఞప్తి చేయగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## మూడవ ర్యాంకులో బంగాళదుంప



మనిషి ఆహారం కోసం ప్రధానంగా వినియోగించే వాటిలో బియ్యం, గోధుమల తర్వాత మూడవ స్థానంలో బంగాళదుంప నిలిచింది. ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన ఆహార పంటగా బంగాళదుంప(ఆలూ) చోటు దక్కించుకుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్నందునే ప్రతీయేటా మే 30 ఇంటర్నేషనల్ పొటాటో డే (అంతర్జాతీయ బంగాళదుంప దినోత్సవం) నిర్వహిస్తూ వస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా 160 దేశాలలో బంగాళాదుంపలను పండిస్తుంటారు. దక్షిణ అమెరికాలోని ఆండీస్‌లో తొలుత బంగాళ దుంపలను పండిచారని చెబుతారు. పరిమాణం, రంగు, పోషక విలువల పరంగా 1,500 నుంచి 2,000 విభిన్న రకాల బంగాళాదుంపలు ప్రపంచంలో అందుబాటులో ఉన్నాయి. బంగాళాదుంప శాస్త్రీయ నామం సోలనమ్ ట్యూబెరోసమ్. ఇవి నైట్ షేడ్ కుటుంబానికి చెందిన మొక్కలు. బంగాళాదుంపలు ప్రపంచవ్యాప్తంగా విభిన్న వంటకాల్లో ఉపయోగించే రూట్ వెజిటేబుల్. బంగాళాదుంపలలో అధికశాతంలో పిండి పదార్థం ఉన్నందున వాటిని మితంగా తినాలని నిపుణులు చెబుతుంటారు.

బంగాళాదుంపలో కేలరీలు: 168, కొవ్వు: 0 గ్రాములు, ప్రోటీన్: 5 గ్రాములు, కార్బోహైడ్రేట్లు: 37 గ్రాములు, ఫైబర్: 4 గ్రాములు, సోడియం: 24 మిల్లీగ్రాములు, విటమిన్ సి: 37%, విటమిన్ బీ6: 31%, పొటాషియం: 27%, మాంగనీస్: 20% ఉంటాయి. బంగాళాదుంపలలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వలన ఆరోగ్యకరమైనవని చెబుతుంటారు. దీనిలో లభించే ఖనిజాలు మెరుగైన రోగనిరోధక శక్తిని అందిస్తాయని, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని, రక్తంలో చక్కెరను నియంత్రిస్తాయని వివిధ పరిశోధనల్లో తేలింది. జీర్ణక్రియకు, వృద్ధాప్య లక్షణాలతో పోరాడేందుకు కూడా బంగాళ దుంపలు దోహదపడతాయి. బంగాళాదుంపలు ఆకలిని తగ్గించడం ద్వారా శరీర బరువు తగ్గడానికి సహాయపడతాయి. మితంగా తీసుకుంటే, బంగాళాదుంపలు ఎంతో ప్రయోజనాన్ని అందిస్తాయి. భారతదేశంలో ఉత్పత్తయ్యే బంగాళాదుంపలలో ఎక్కువ భాగం ఉత్తర ప్రదేశ్ నుండే వస్తాయి. పశ్చిమ బెంగాల్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, పంజాబ్‌లలో బంగాళదుంపలను విరివిగా పండిస్తారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com